తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

సంపుటి : 22 సంచిక : 340 | శనివారం నవంబర్ 16 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5


## కన్నప్పతోనైనా మంచు విష్ణుకు హిట్టు పడేనా..?

8 లో..

### ఇదండీ..కబురు..



ఏదో ఒకరోజు మనం ఫేమస్ అవుతామని చెప్పానా.. లేదా..!

# త్వరలోనే బిఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు

- కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీగా ఎమ్మెల్యేలు
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి



**కబురు, హైదరాబాద్ నవంబర్ 15**

కాంగ్రెస్ పార్టీలో త్వరలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల చేరికలు ఉంటాయని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.బీఆర్ఎస్ పార్టీలోని అగ్ర నాయకులు, మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ ఒకే పార్టీలో ఉండరని ఈ సందర్భంగా ఆయన జోస్యం చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణపై ఇప్పటికే సంప్రదింపులు పూర్తయ్యాయని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ రెడ్డికి మధ్య మంచి సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. అయితే బీఆర్ఎస్‌లోని పలువురు కీలక నేతలు బీజేపీలోకి వెళ్తారని ఆయన పేర్కొన్నారు. ఇక శనివారం నుంచి తాను జిల్లాల పర్యటన చేస్తానని.. అందులోభాగంగా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తానని చెప్పారు. అలాగే పార్టీల్లో ఉన్న ఇబ్బందులను సైతం సరి చేస్తానని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మరోవైపు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా కేబినెట్ విస్తరణతోపాటు పలు అంశాలపై పార్టీ పెద్దలతో ఆయన చర్చించినట్లు తెలుస్తుంది. అలాగే రాష్ట్రంలో ప్రస్తుతం కుల గణన జరుగుతుంది. అదే విధంగా మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఆయా అంశాలపై సైతం ఆయన పార్టీ సీనియర్లతో చర్చించినట్లు సమాచారం. ఇంకోవైపు గతేడాది చివరల్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం కొలువు తీరింది.

మిగతాద్ది 2 లో



# బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు

- కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేసి బీఆర్ఎస్ నాయకులనే జైల్లో వేశారు
- విలువైన భూములను వడ్డీపావుసేరులో గుంజుసుకునే ప్రభుత్వం
- లగచర్ల రైతన్నలతో కేటీఆర్ ములాఖత్

**సంగారెడ్డి, నవంబర్ 15**

కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని కావాలనే జైల్లో పెడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. లగచర్లలో అధికారులపై దాడికి పాల్పడ్డ వారిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉన్నారని కేటీఆర్ తెలిపారు. సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతన్నలతో కేటీఆర్ శుక్రవారం ములాఖత్ అయ్యారు.

2 లో





**ఆదివాసీ మహిళ ముర్మును**

# రాష్ట్రపతిని చేశాం



దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓ ఆదివాసీ మహిళకు తమ ప్రభుత్వం అత్యున్నత రాష్ట్రపతి పదవిని ఇచ్చి గౌరవించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీ బిడ్డ ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేయడం ఎన్డీఏ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మొదట్లో ఆ పదవికి ఆమె పేరును ప్రతిపాదించగానే ముర్మును భారీ మెజారిటీతో గెలిపించాలని బిహార్ సీఎం నితీశ్ కుమార్ దేశం మొత్తానికి పిలుపునిచ్చారని ప్రధాని గుర్తుచేసుకున్నారు.

- గిరిజనులకు అత్యున్నత గౌరవం ఇచ్చిన ఘనత మాదే
- పీఎం జన్‌మన్ యోజన పథకం ఘనత ముర్ముదే
- బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా నివాళి
- బిర్సాముండా పేరిట పోస్టల్ స్టాంపు ఆవిష్కరణ
- ఆదివాసీలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్న మోడీ

**కబురు, పట్నా, నవంబర్ 15**

పీఎం జన్‌మన్ యోజన పథకం ద్వారా పనుల ప్రారంభ ఘనత ద్రౌపదీ ముర్ముదే అని కొనియాడారు. ఆదివాసీల కష్టాలను తీర్చేందుకు ఈ పథకం ద్వారా రూ.24వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. బిహార్‌లో నిర్వహించిన సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఆదివాసీలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ధర్తీ అబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా బీహార్‌లోని జాముయ్‌లో ప్రధాని మోడీ ఆయనకు నివాళు లర్పించి, ఆయన పేరిట పోస్టల్ స్టాంపును విడుదల చేశారు.

# ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత

- రైతులకు ఇబ్బంది రాకుండా చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**కబురు,సిద్దిపేట,నవంబర్ 15**

వికారాబాద్ కలెక్టర్‌ను కొట్టడం తప్పే అంటున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అరెస్టులు చేయొద్దంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఓ కేంద్రమంత్రి మాట్లాడే మాటలేనా అని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్‌ను కొట్టినా అరెస్టులు వద్దంటున్న కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి పదవికి అర్హుడా అని ప్రశ్నించారు. బాధితులు నిరసన తెలపడంలో తప్పులేదని.. కానీ అధికారులపై దాడి చేయడం తప్పన్నారు. కలెక్టర్‌ను కొట్టే ధైర్యం వీరికి ఎక్కడి నుంచి వచ్చిందని

# రాజకీయ కుట్రతోనే కులగణనపై అపోహలు



**కబురు, హైదరాబాద్ నవంబర్ 15**

కుల గణన సర్వే ఎవరికీ వ్యతిరేకం కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని దోభిఘాట్ గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఇక్కడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దోభిఘాట్ గ్రౌండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని చెప్పారు. కులగణన సర్వేలో బ్యాంకు ఖాతా వివరాలు అడగట్లేదని స్పష్టం చేశారు. కులం వివరాలు చెప్పడం ఇష్టం లేకుంటే 999 ఆప్షన్ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే 30 శాతం కులగణన సర్వే పూర్తయిందని తెలిపారు. సర్వేలో ఎలాంటి అపోహలు వద్దన్నారు. రాజకీయ కుట్ర చేసేవారే వీటిని సృష్టిస్తున్నారని చెప్పారు. కులగణన సర్వే వల్ల కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టవచ్చని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## హైదరాబాద్‌లో అలెగ్రో మైక్రో సిస్టమ్స్ ఏర్పాటు..

# 500 మందికి ఉద్యోగావకాశాలు



**కబురు, హైదరాబాద్ నవంబర్ 15**

తెలంగాణలో పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన వాతావరణం ఉందని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పలు అంతర్జాతీయ కంపెనీలు ముందుకువస్తున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అంతర్జాతీయ సెమీకండక్టర్ల కంపెనీ అలెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్‌లో పరిశోధనాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి ముందుకువచ్చిందని మంత్రి చెప్పారు. ఈమేరకు ఆ కంపెనీ సీఈఓ వినీత్ బృందం.. సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిసింది. పలు ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీలకు సెమీ కండక్టర్లు సరఫరా చేస్తున్నట్లు అలెగ్రో ప్రతినిధులు మంత్రికి వివరించారు. పెట్టుబడిదారులకు సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ముందుంటుందని మంత్రి వెల్లడించారు. అలెగ్రో పరిశోధనాభివృద్ధి సంస్థ ఏర్పాటుతో 500 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు.

# ఖాపూపూర్ అడవుల్లో పులి సంచారం కలకలం



**కబురు,నిర్మల్,నవంబర్ 15**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ అడవుల్లో సంచారం స్థానికంగా కలకలం రేపుతోంది. ఫారెస్ట్ అధికారులు అడవిలో ఏర్పాటు చేసిన కెమెరాల్లో పులి సంచరిస్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దీంతో ఖానాపూర్ సరిహద్దు అటవీ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. ఒంటరిగా ఎవరూ అడవిలోకి వెళ్లొద్దని, సాయంత్రం త్వరగా ఇండ్లకు చేరుకోవాలని చూసుకోవాలని సూచించారు. అటవీశాఖ అధికారుల హెచ్చరికతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెద్ద పులి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందేమోనని భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి పులిని బంధించాలని కోరుతున్నారు.

# కేసీఆర్ బాటలోనే.. రేవంత్‌రెడ్డి



**కబురు, హైదరాబాద్ నవంబర్ 15**

తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేశామని, మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. సికింద్రాబాద్ టూరిజం ప్లాజాలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. మాటలు ప్రజలకు.. మూటలు పార్టీకి అన్నట్లుగా.. కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో ఏ ముఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. అశోక్‌నగర్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# బుల్డోజర్ సంస్కృతిపై వేటు!

'చావుకి పెడితే లంఖణానికి వస్తార'ని నానుడి. కొన్నేళ్లుగా ప్రజాస్వామ్యంలో



బుల్డోజర్ స్వామ్యాన్ని జొప్పించి మురిసి ముక్కలవుతున్నవారికి సర్వోన్నత న్యాయస్థానం కీలెరిగి వాత పెట్టింది. నేరం రుజువై శిక్షపడిన లేదా నిందితులుగా ముద్రపడినవారి ఆవాసాలను కూల్చటం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది. అలాంటి చేష్టలకు పాల్పడే ప్రభుత్వాధికారులు బాధితులకు పరిహారం చెల్లించటంతోపాటు వారి ఇళ్ల పునర్నిర్మాణానికయ్యే మొత్తం వ్యయాన్ని వ్యక్తిగతంగా భరించాల్సి వుంటుందని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం తేల్చిచెప్పింది. కూల్చివేతలకు ఏ నిబంధనలు పాటించాలో వివరించే మార్గదర్శకాలను విడుదల చేసింది. వీటిని ఉల్లంఘించే అధికారులపై కోర్టు ధిక్కార నేరం కింద చర్యలు తీసుకోవటంతోపాటు వ్యాజ్యాలు కూడా మొదలవుతాయని హెచ్చరించింది. 'ఇళ్లు కూల్చినప్పుడల్లా నిశిరాత్రిలో నడిరోడ్లపై చిన్నా రులూ, ఆడవాళ్లూ విలపిస్తున్న దృశ్యాలు అరాచకానికి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి' అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. ఒకప్పుడు అక్రమ నిర్మాణాల కూల్చివేతకు కొన్ని విధివిధానాలు పాటించేవారు. నోటీసులిచ్చి సంజాయిషీలు తీసుకుని ఆ తర్వాత చర్యలు ప్రారంభించేవారు. కీడు శంకించినవారు న్యాయస్థానాలను ఆశ్రయించటం, వారికి ఊరట దొరకటం కూడా రివాజే. తమకు నచ్చని అభిప్రాయాలున్నా, ఏదో ఉదంతంలో నిందితులుగా ముద్రపడినా వారి ఇళ్లూ, దుకాణాలూ కూల్చే పాపిష్టి సంస్కృతి ఇటీవలి కాలపు జాడ్యం. సినిమా భాషలో చెప్పాలంటే ఇది 'పాన్ ఇండియా' సంస్కృతి! దీనికి ఆద్యుడు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. ఉత్తర ప్రదేశ్‌లో నేర సంస్కృతిని అరికట్టడంలో, సంక్షేమ పథకాలు అర్హులకు అందించటంలో ఆయన విజయం సాధించారని బీజేపీ చెబుతుంటుంది. కానీ అంతకన్నా 'బుల్డోజర్ బాబా'గా పిలిపించుకోవటం యోగికి, అక్కడి బీజేపీకి ఇష్టం. చూస్తుండగానే ఇది అంటువ్యాధిలా పరిణమించింది. మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, జార?ండ్, కర్ణాటకల్లో బీజేపీ ప్రభుత్వాలు బుల్డోజర్లతో విధ్వంసానికి దిగాయి. మొన్నటి ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో దొడ్డిదారిన అధికారం చేజిక్కించుకున్నాక బాబు ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ కార్యాలయాలను బుల్డోజర్లతో కూల్చాలని చూసింది. ఒకటి రెండుచోట్ల ఆ పనిచేసింది కూడా. ఇక తమకు వ్యతిరేకంగా పనిచేశారన్న కక్షతో దిక్కూ మొక్కూలేని పేదల ఇళ్లు సైతం ఇదే రీతిలో ధ్వంసం చేసింది. రాజస్థాన్‌లో 2022లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా బీజేపీ ఏలుబడిలో ఉన్న రాజ్‌గఢ్ మున్సిపాలిటీ పరిధిలో ఈ దుశ్చర్య చోటు చేసుకుంది. మహారాష్ట్రలో శివసేన–కాంగ్రెస్ – ఎన్సీపీ కూటమి సర్కారు హయాంలో నిందితుల ఇళ్లనూ, దుకాణాలనూ కూల్చారు. కేంద్రం మాటే చెల్లుబాటయ్యే ఢిల్లీలో జహంగీర్‌పురా ప్రాంతంలో మతఘర్షణలు జరిగినప్పుడు అనేక ఇళ్లూ, దుకాణాలూ నేలమట్టం చేశారు. బాధితులు సుప్రీంకోర్టు ఉత్తర్వులు పొందేలోగానే విధ్వంసకాండ పూర్తయింది. 2020 నుంచి ముమ్మరమైన ఈ విష సంస్కృతిపై సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరిస్తూనే వచ్చింది. 'నిందితులు మాత్రమే కాదు, శిక్ష పడినవారి ఇళ్లను సైతం కూల్చడానికి లేదు. ఈ విషయంలో చట్టనిబంధనలు పాటించి తీరాలి' అని స్పష్టం చేసింది. కానీ ఆ చేష్టలు తగ్గిన దాఖలా లేదు. చుట్టూ మూగేవారు 'ఆహా ఓహో' అనొచ్చు. అవతలి మతంవారి ఇళ్లు, దుకాణాలు కూలుతున్నాయంటే తన్మయత్వంలో మునిగే వారుండొచ్చు.

ఖరికి ఇళ్లు కూల్చిన ఉదంతాల్లో పాలుపంచుకున్న అధికారులు విందులు చేసుకున్న ఉదంతాలు కూడా వెల్లడయ్యాయి. కానీ సమాజంలో అరాచకం ప్రబలకూడదన్న ఉద్దేశంతో రాజ్య వ్యవస్థ ఏర్పడినప్పుడూ... రాజ్యాంగమూ, చట్టాలూ ఉన్నప్పుడూ... రాజ్యవ్యవస్థే తోడేలుగా మారితే దిక్కెవరు? సుప్రీంకోర్టు వద్దుగాక వద్దని చెప్పాక కూడా ఈ పోకడ ఆగలేదంటే ఏమను కోవాలి? ఒక వ్యక్తి నిజంగా తప్పు చేశాడనుకున్నా అతని కుటుంబమంతా అందుకు శిక్ష అనుభవించి తీరాలన్న పట్టుదల నియంతృత్వ పోకడ కాదా? సుప్రీంకోర్టు 95 పేజీల్లో ఇచ్చిన తీర్పు ఎన్నో విధాల ప్రామాణికమైనదీ, చిరస్మరణీయమైనదీ. 'ఇల్లంటే కేవలం ఒక ఆస్తి కాదు... అది కొందరు వ్యక్తుల, కుటుంబాల సమష్టి ఆకాంక్షల వ్యక్తీకరణ. అది వారి భవిష్యత్తు. వారికి స్థిరత్వాన్నీ, భద్రతనూ చేకూరుస్తూ, సమాజంలో గౌరవం తీసుకొచ్చేది. ఇలాంటి ఇంటిని బలవంతంగా తీసుకోవాలంటే ముందుగా ఇతర ప్రత్యామ్నాయాలేవీ లేవని అధికారులు విశ్వసించాలి' అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించిన తీరు అమానవీయత నిండిన పాలకులకు ఏమేరకు అర్థమైందో సంశయమే. ఆ మాటెలా వున్నా కఠిన చర్యలుంటాయన్న హెచ్చరిక వారిని నిలువరించే అవకాశం ఉంది. దేశంలో దిక్కూ మొక్కూలేని కోట్లాదిమంది సామాన్యులకు ఊరటనిచ్చే ఈ తీర్పులో హిందీ భాషా కవి ప్రదీప్ లిఖించిన కవితకు కూడా చోటు దక్కింది. దాని సారాంశం – 'ఇల్లు, పెరడు ప్రతి ఒక్కరి స్వప్నం. ఆ కలను కోల్పోవడానికి సిద్ధపడతారా ఎవరైనా?' బ్రిటన్ న్యాయకోవిదుడు లార్డ్ డెన్నింగ్ చేసిన వ్యాఖ్యలను కూడా తీర్పులో ఉటంకించారు. 'రాజ్యా ధికారాన్ని ధిక్కరించి అతి సామాన్యుడు వేసుకున్న గుడిసె చిరుగాలికే వణికేంత బలహీనమైనది కావొచ్చు. ఈదురుగాలికి ఇట్టే ఎగిరిపోవచ్చు. దాన్ని వర్షం ముంచెత్తవచ్చు. కానీ చట్టనిబంధన అనుమతిస్తే తప్ప ఆ శిథిల నిర్మాణం వాకిలిని అతిక్రమించటానికి ఇంగ్లండ్ రాజుకు సైతం అధికారంలేదు' అని లార్డ్ డెన్నింగ్ అన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు చూశాకైనా తమపై ఏ స్థాయిలో విశ్వాసరాహిత్యం ఏర్పడిందో ప్రభుత్వాలు గ్రహించాలి. నీతిగా, నిజాయితీగా, రాజ్యాంగానికి అనుగుణంగా పాలించటం నేర్చుకోవాలి.

# ఆదివాసీ మహిళ ముర్మును రాష్ట్రపతిని చేశాం

మొదటిపేజీ తరువాయి
6000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. గిరిజన సమాజాన్ని నిర్లక్ష్యం చేయడానికి గత ప్రభుత్వాలే కారణమని ప్రధాని మోడీ అన్నారు. గత ప్రభుత్వాల వల్ల గిరిజన సమాజం నిర్లక్ష్యానికి గురైందన్నారు. గిరిజన సమాజం దేశాభివృద్ధి రేసులో వెనుకబడింది. దేశ స్వాతంత్ర్యానికి ఒక పార్టీ లేదా ఒక కుటుంబం సహకరించిందని చేసే ప్రచారం తప్పన్నారు. గిరిజన సమాజంలోని ఎందరో మహానాయకులు త్యాగాలు చేశారని ప్రధాని మోడీ అన్నారు. గిరిజన సమాజం చేసిన కృషికి చరిత్రలో సముచిత స్థానం దక్కలేదన్నారు. ఏళ్ల తరబడి గిరిజన సంఘం నిర్లక్ష్యానికి గురైంది. గిరిజన సమాజం, సహకారం, త్యాగాన్ని తుడిచిపెట్టే ప్రయత్నం జరిగిందన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులపై ఎలాంటి శ్రద్ధ తీసుకోలేదన్నారు. వారి జీవితాల్లోని కష్టాలను తగ్గించడానికి, మా ప్రభుత్వం 24 వేల కోట్ల రూపాయలతో ప్రధానమంత్రి జన్మన్ యోజనను ప్రారంభించింది. దేశంలోని అత్యంత వెనుకబడిన గిరిజనుల ఆవాసాల అభివృద్ధికి ఈ పథకం భరోసా ఇస్తోందని అన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులకు మన ప్రభుత్వం వేల సంఖ్యలో శాశ్వత గృహాలను ఇచ్చిందని ప్రధాని అన్నారు. రాముడిని యువరాజును చేసింది గిరిజన సమాజమేనని ప్రధాని మోడీ అన్నారు. భారతదేశ సంస్కృతిని, స్వాతంత్ర్య పరిరక్షణ కోసం వందల ఏళ్లుగా పోరాటానికి నాయకత్వం వహించినది గిరిజన సమాజం. భారతదేశ సంస్కృతి, స్వాతంత్ర్య పరిరక్షణ కోసం గిరిజన సమాజం వందల ఏళ్ల పాటు పోరాటాన్ని నడిపిందన్నారు. గిరిజన సమాజం ప్రకృతిని, ప్రాచీన వైద్య విధానాలను సజీవంగా ఉంచిందన్నారు. గత ప్రభుత్వాలు వెనకబడిన వర్గాల సంక్షేమం గురించి ఎప్పుడూ ఆలోచించలేదని.. వారి అభివృద్ధి కోసం కృషి చేయలేదని ప్రధాని విమర్శించారు. సమాజానికి దూరంగా నివసిస్తున్న ఆదివాసీలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వారు పండించే దాదాపు 90 అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇచ్చామన్నారు. ఆదివాసీ యువత క్రీడలలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని.. వారిని మరింత ప్రోత్సహించడానికి అనేక క్రీడా సౌకర్యాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆదీవాసీలకు చదువు, సంపద, వైద్య సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వారి సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేశామని.. బడ్జెట్‌ను రూ.25,000 కోట్ల నుంచి రూ.1.25 లక్షల కోట్లకు పెంచామని ప్రధాని వెల్లడించారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తమ భూములు తమకే ఉండాలని లగచర్ల రైతులు పోరాడుతున్నారు. మార్కెట్‌లో ఎకరం రూ. 70 లక్షల విలువ ఉన్న భూములను అడ్డికి పావుశేరుకు రియల్ ఎస్టేట్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గుంజేసుకుంటుందని రైతులు చెబుతున్నారు. కేవలం ఎకరం భూమి రూ. 10 లక్షలకు గుంజేసుకుంటున్నారని రైతులు బాధపడుతున్నారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా రైతులు 9 నెలలగా పోరాటం చేస్తున్నారు. లగచర్ల, హకీంపేటతో పాటు మరో రెండు తండాల ఆడబిడ్డలు రోదిస్తున్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రెడ్డి రాబందు మాదిరిగా వ్యవహరిస్తున్నారు. ఫార్మా కంపెనీలు కాలుష్యమని ఆయన ప్రచారం చేశారు. అదే ఫార్మాను కొడంగల్ తెస్తా.. 3 వేల ఎకరాలు రావాలని పేదల భూములు గంజుకుంటున్నారు. దీంతో స్థానిక రైతులు మర్లబడ్డారు. 9 నెలలుగా పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. అధికారుల ముందు నిరసన తెలిపితే దాడుల పేరిట అరెస్టులు చేసి జైల్లో వేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇవాళ లగచర్లలో దుర్మార్గమైన పరిస్థితి నెలకొని ఉంది. కులగణనలో పాల్గొని వచ్చిన పంచాయతీ సెక్రటరీని కూడా అరెస్టు చేసి జైల్లో వేశారు. ఆ సంఘటనలో పాల్గొనలేదు.. అయినా తనను జైల్లో వేశారని ఆ యువకుడు చెబుతున్నాడు. ఇంకో యువకుడు వనపర్తిలో చదవుకుంటున్నాడు. ఈ ఘటన గురించి తెలుసుకుని మా ఇంటి వాళ్లు ఎలా ఉన్నారో అని వస్తే నన్ను కూడా తీసుకెళ్లారని చెప్పారు. 70 మందిని అరెస్టు చేసి రెండు డీసీఎంలలో తీసుకెళ్లారని చెప్పారని కేటీఆర్ తెలిపారు. దుద్యాల మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ అనుచరులు కూడా ఈ దాడుల్లో పాల్గొన్నారు. వారి భూములు కూడా ఈ ఫార్మా విలేజ్‌లో పోతున్నాయి. రమేశ్, నర్సింహులు, రాములు అనే కాంగ్రెస్ కార్యకర్తలు కూడా దాడులు చేశారు. 70 మందిని తీసుకెళ్తే.. తిరుపతి రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేశారట. బీఆర్ఎస్ వాళ్లు 21 మందిని రిమాండ్‌కు పంపి.. మిగతా వారిని ఇంటికి పంపించచారట. కేవలం బీఆర్ఎస్ వాళ్లనే మాత్రమే జైల్లో పెట్టాలని అనుముల తిరుపతి రెడ్డి ఆదేశాలు ఇచ్చారట. ఎలాంటి పదవి లేని తిరుపతి రెడ్డికి అధికారులు, పోలీసులు మోకరిల్లుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

# కేసీఆర్ బాటలోనే.. రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
ప్రభుత్వం ఇంకా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించలేదు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం చెందిందన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుచేయలేదని విమర్శించారు.

**ఈనెల 21 నుంచి 24 వరకు లోక్‌మంథన్ కార్యక్రమం..**

శిల్పకళావేదికలో ఈనెల 21 నుంచి 24 వరకు లోక్ మంథన్ నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట పర్యాటక భవన్‌లో లోక్ మంథన్‌పై కేంద్రమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈ ఏడాదిలో అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవంగా లోక్‌మంథన్‌ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 21న స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 22న లోక్‌మంథన్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రారంభిస్తారని కిషన్‌రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా 24న జరిగే ముగింపు కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షేకావత్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు, విదేశీ అతిథులు హాజరుకానున్నట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు.

## త్వరలోనే బిఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు

మొదటిపేజీ తరువాయి
దాంతో బీఆర్ఎస్ ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో పలువురు బీఆర్ఎస్ అగ్రనేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బీఆర్ఎస్ పార్టీలో కేవలం కేసీఆర్ ఫ్యామిలీ మాత్రమే ఉన్నదన్నట్లుగా పరిస్థితి మారింది. ఇక ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు దాదాపు అన్ని ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్నాయి. అదే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కనీసం డిపాజిట్ కూడా దక్కక పోవడం గమనార్హం. మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం అన్ని విజయావకాశాలను ఒడిసి పట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్‌లోని అగ్రనేతలను సైతం పార్టీలోకి తీసుకు వచ్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ పక్కా ప్రణాళికలతో ముందుకు వెళుతుంది. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌పై విధంగా వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తుంది.

## ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత

మొదటిపేజీ తరువాయి
అడిగారు. పైనున్న నాయకుల ప్రోత్సాహం వల్లనే కదా అని ప్రశ్నించారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం సందర్శించి, సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఎలాంటి ఇబ్బందులు ఉన్న రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని.. కానీ ప్రతిపక్ష పార్టీల నాయకులు రాద్ధతం చేయకుండా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కో సీనియర్ అధికారి నియమించి ధాన్యం కొనుగోలను పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. కాళేశ్వరం లేకున్నా కాళేశ్వరం ద్వారా పంటలు పండాయి అంటున్నారు బీఆర్ఎస్ నాయకులు.. కానీ రాష్ట్రంలో అత్యధికంగా పంటలు పండాయని తెలిపారు. రైస్ మిల్లర్ల విషయంలో ఎక్కడ ఇబ్బంది లేదన్నారు. 20 మంది డిఫల్టర్‌లు ప్రభుత్వ బకాయిలు చెల్లించి కొనుగోలులో పాల్గొనాలని తెలిపారు. 101 మంది రైస్ మిల్లర్లు ఉన్నారని.. వారు బ్యాంక్ గ్యారంటీ ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 35 శాతం కుటుంబ సర్వే పూర్తయిందని తెలిపారు. కోటి 16 లక్షల ఇండ్లను 87 వేల మంది ఎన్యుమరేటర్లతో సర్వే చేయిస్తున్నామన్నారు. ఎన్యుమరేటర్లు తమ ఐడీ కార్డుతో పరిచయం చేసుకోవాలని.. దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. మేడ్చల్ వద్ద రోడ్డుపై సర్వే పెపర్లపై సమాచారం లేదని.. అలాంటిది జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సర్వేపై ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయడానికి సోషల్ మీడియా వేదికగా విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రాజ్యాంగానికి వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డు

**– కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ కొండా**

**హైదరాబాద్,నవంబర్15**
రాజ్యాంగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ బోర్డును తీసుకొచ్చిందని, సుప్రీంకోర్టుకు మించి వక్ఫ్ బోర్డుకు అధికారాలిచ్చారని బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. వక్ఫ్ బోర్డు అనేది ఒక క్రూరమైన హాస్యం. నవ్వాలో.. ఏడవాలో.. బాధపడాలో తెలియని పరిస్థితిగా ఉందని అన్నారు. ఔరంగజేబు విధానాలు ఇప్పటికీ ప్రజలను పీడిస్తున్నాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. '300 ఏళ్ల క్రితం ఔరంగజేబు నోటి మాటతో భూములు ఇచ్చి ఉండొచ్చు. కానీ, నేడు కుప్పలు కుప్పలుగా డాక్యుమెంట్స్‌తో ఆ భూములు మావి అని అంటున్నారు. ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు కీలకం.. ఎవరైనా సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాల్సిందే.. శీతాకాల సమావేశాల్లో వక్ఫ్‌బోర్డు బిల్లు పార్లమెంట్‌లో పాస్ అవుతుంది. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ముస్లిం సమాజానికి వ్యతిరేకం కాదు' అని ఎంపీ అన్నారు.

## తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించిన అయిత హరీష్

హుజురాబాద్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం శుక్రవారం రోజున హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం లోని హుజురాబాద్ పట్టణంలో పార్టీ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా హుజురాబాద్ అసెంబ్లీ ఇంచార్జ్ అయిత హరీష్ మాట్లాడుతూ పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కు కార్యకర్తలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన కార్యకర్తలను అభినందించారు. టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పర్లపల్లి రవిందర్ మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త వంద రూపాయల తో సభ్యత్వం తీసుకోవాలని తద్వారా 5 లక్షల బీమా సౌకర్యం ను పార్టీ కల్పించిందని తెలిపారు. టీడీపీ జిల్లా మాజీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఎస్ కె ఫయాజ్ మాట్లాడుతూ భవిష్యత్తు లో చనిపోయిన కార్యకర్తల మట్టి ఖర్చుల క్రింద తక్షణ సహాయంగా 10 వేలు టీడీపీ పార్టీ అందచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇల్లందుల రమేష్, వర్ధినేని లింగరావు,సిమ్మసర్ధి శివ,బత్తిని సంజీవ్, ఆడెపు రవీందర్, రమేష్,గరిగె స్వామి, ఎం డి ఆఫ్రిద్ పలువురు పాల్గొన్నారు.

# కార్తీక పౌర్ణమి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి



**కబురు న్యూస్ కామారెడ్డి, నవంబర్ 15**
తాడ్వాయి మండలంలోని బ్రహ్మాజీవాడి గ్రామంలోని సిద్దేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న 33వ కార్తీక పౌర్ణమి బ్రహ్మోత్సవాలకు బిజెపి రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పైడి ఎల్లారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి రోజున స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, స్వామివారి కృపతో ప్రజలు, రైతులు పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# విజయ డైరీ పాలనే వినియోగించాలి...



**కబురు న్యూస్,బోధన్ నవంబర్15..**
తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనగుతున్న విజయ డైరీ పాలనే వినియోగించాలని, కల్తీ పాలు వాడడం వలన అనేక మంది అనారోగ్యానికి గురవుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని నీటి పారుదల శాఖ అతిధి గృహంలో పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లకు, మున్సిపల్ అధికారులకు, పాల ఏజెన్సీ, హోటళ్ల నిర్వాహకులకు మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. కల్తీ పాల వినియోగంతో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం అవకాశం ఉందని, అధ్యాయనాల్లో వెల్లడైందని, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న విజయ డైరీలో లభించే నాణ్యమైన పాలు వాడాలని సూచించారు. హోటళ్లలో, ప్రజలు సైతం తమ ఇళ్లలో విజయ డైరీ పాలను వినియోగించి ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. విజయ డేరీ పాల వినియోగంపై ప్రజలకు అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హాందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టిపిసిసి డెలిగేట్ గంగాశంకర్, కౌన్సిలర్లు శరత్ రెడ్డి, పిట్ల

# విద్యుత్ లైన్ మెన్ పై మహిళ దాడి...

**కబురు న్యూస్,బోధన్ నవంబర్15..**
బోధన్ మండలంలోని ఉట్పల్లి గ్రామంలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ లైన్ మెన్ పై మహిళ దాడి చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ లైన్ మెన్ నవీన్, విద్యుత్ శాఖ అధికారులు ఊట్పల్లి గ్రామానికి వెళ్లిన సమయంలో ఒక ఇంట్లో అనధికారంగా విద్యుత్ వాడకం జరుగుతోందని గుర్తించడం జరిగింది. అనధికార విద్యుత్ కరెంట్ తీగలను తీసివేయడానికి లైన్ మెన్ ప్రయత్నించినప్పుడు ఇంటికి సంబంధించిన మహిళ లైన్ మెన్ పై కర్రతో దాడిచేసింది. ఈ దాడిలో అసిస్టెంట్ లైన్ మెన్ నవీన్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనపై భాధితుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు.

# బాపూజీ వాచనాలయం భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,నవంబర్ 15 :**
నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న బాపూజీ వాచనాలయం భవన నిర్మాణ పనులను మాజీ మంత్రి,బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు.సుమారు ఏడు దశాబ్దాలుగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతీయువకులకు,నగర వాసులకు వాచనాలయం సేవలందాయని,నూతన భవన నిర్మాణ పనులు చేపట్టడం అభినందనీయమని ఆయన అన్నారు.తనవంతుగా నిర్మాణ పనుల కోసం రూ.10లక్షలు అందజేస్తానని అన్నారు.ఈ సందర్భంగా బాపూజీ వాచనాలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ బాపూజీ వాచనాలయ కమిటీ చైర్మన్ భక్తవత్సలం (ఢిల్లీ),ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణ, కోశాధికారి గంగాధర్ రావు,కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ,మీసాల సుధాకర్ రావు,బోగ అశోక్,మహిపాల్ రెడ్డి,లక్కంరెడ్డి,ప్రతాప్ రుద్ర,దిలీప్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆలోచనలను ఆచరిస్తున్న... మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి





## - నియోజకవర్గమే పోచారం కుటుంబం.... భాస్కర్ రెడ్డి

**కబురు న్యూస్, బాన్సువాడ, నవంబర్ 15**
అంబేద్కర్ ఆలోచనలను ఆశయాలకు అనుగుణంగా తాను నడుచుకుంటున్నానని ఉమ్మడి జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాజారామ్ దుబ్బాలో బుడగ జంగాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోచారం కుటుంబం పేద ప్రజల సంక్షేమంతో పాటు వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకునే కుటుంబం పోచారం కుటుంబమన్నారు. అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గంలో పేద విద్యార్థుల కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటుతోపాటు ఆసుపత్రి, ఉన్నత విద్య అభ్యసించే వారి కోసం తాను తోచినంత సహాయం చేస్తూ అండగా ఉంటున్నానన్నారు. రాజారామ్ దుబ్బాలో గత ప్రభుత్వంలో నలబై ఇండ్లను కేటాయించడం జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందించే బాధ్యత తమదన్నారు. తన సొంత ఖర్చుతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకుగాను మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి,కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, నాయకులు కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ గంగుల గంగారం, వైస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, న్యాయవాది భూషణ్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, ఎమ్మార్పీఎస్ సంఘ నాయకులు మైసయ్య, కుమ్మరి రాజు, ప్రశాంత్, అమీర్ చావుస్, రామా గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సోమేశ్వర్ శివారులో యదేచ్ఛగా మొరాం అక్రమ తవ్వకాలు..

## గుట్టలు కనుమరుగవుతున్న కన్నెత్తి చూడని అధికారులు







**కబురు న్యూస్ బాన్సువాడ నవంబర్ 15**
పర్యావరణాన్ని పరిరక్షిద్దాం ప్రకృతిని కాపాడాలని నినాదాలు కేవలం ప్రకటనలకు మాత్రమే సరిపోతుందని, కార్యచరణలో మాత్రం పర్యావరణాన్ని భక్షిద్దాం డబ్బులను దోచేసుకుందాం అనే విధంగా బాన్సువాడలో మొరం మాఫియా అక్రమ తవ్వకాలు జరుపుతున్న సంబంధిత అధికారులు మాత్రం తమకేవి పట్టనట్లు వ్యవరిస్తూ ఉండడంతో సామాన్య ప్రజలు ప్రేక్షక పాత్ర వహించాల్సి వస్తుంది. సోమేశ్వర్ గ్రామ శివారులో అక్రమ మొరం తవ్వకాలు జరుపుతున్నారని సంబంధిత అధికారులకు స్థానిక తహసిల్దార్ కు గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, మోరాం అక్రమ రవాణా జరుగుతున్న విషయం తెలిసినప్పటికీ అక్రమ రవాణాకు ఎలాంటి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. మొరం మాఫియాకు కొంతమంది అధికారులు అక్రమ రవాణా చేస్తున్న మొరం వ్యాపార నుండి నెల నెలకు మామూలు తీసుకుంటున్నారని పలువురు బాహటంగానే ఆరోపిస్తున్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా స్థానిక నాయకులు ఎటువైపు ఉంటే అటువైపు మొరం మాఫియా మొగ్గ చూపుతూ వారికి అండగా ఉంటున్నామని సమాజంలో తమకంటూ గుర్తింపు ఉందని చెలాయించుకుంటూ తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరుకాయలుగా మలుచుకుంటున్నారు. సామాన్యుడు ట్రాక్టర్ మొరం కావాలంటే నానా ఇబ్బందులు పెట్టే సంబంధిత అధికారులు బాన్సువాడ పట్టణ శివారులో గుట్టలు మాయమవుతున్న అటువైపు మాత్రం కన్నెత్తి చూడకపోవడం ఒక ఎత్తయితే ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ ముందర నుండే అక్రమ రవాణా జరుపుతున్న సంబంధిత శాఖల అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల పట్టణ ప్రజలు అసహన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా శాఖ ఉన్నత అధికారులు బాన్సువాడ లో జరుగుతున్న మొరం మాఫియా పై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో మరో రెండు సంవత్సరాల్లో బాన్సువాడ పట్టణ శివారులో గుట్టలు కనుమరుగు కావడం ఖాయంమని ప్రజలు చర్చించుకుంటున్నారు

# చదువు ఉంటేనే ఆర్థికంగా సామాజికంగా ముందుకు వెళ్తాం... కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్





## - పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం... కార్పొరేషన్ చైర్మన్





**కబురు న్యూస్ బాన్సువాడ, నవంబర్ 15**

విద్య ద్వారానే సామాజికంగా ఆర్థికంగా ఎదుగుతామని, ప్రతి ఒక్కరు తమ పిల్లలకు మంచి భవిష్యత్తు అందాలంటే ప్రతి ఒక్కరు చదువుకునేందుకు తోడ్పాటు అందించాలని కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. శుక్రవారం తాడ్కోల్ గ్రామ శివారులోని రాజారామ్ దుబ్బాలో బుడగ జంగా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుడగ జంగాలతో తనకు ఎంతో అనుబంధం ఉందని తాను సర్పంచ్ గా ఉన్న నాటి నుండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారు. బుడగ జంగాలకు తన వద్దకు వచ్చే వారికి నా వంతు సహాయ సహకారాలు అందించానని, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళను అందజేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కేవలం ఆదాని, అంబానీల కోసమే పనిచేస్తుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమ కోసం రెండు లక్షల రుణమాఫీని చేసిన ఘనత ప్రభుత్వాన్నిదన్నారు. రిజర్వేషన్లను ఉపయోగించుకొని ఉన్నత చదువులు చదువుకొని సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగాలని నాయకుల ప్రయత్నంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రయత్నం ఉండాలని ఆయన సూచించారు. స్థానిక నాయకులకే ప్రజలు ఆదరించాలని , బాధ వచ్చినా సుఖం వచ్చిన స్థానిక నాయకులె అండగా ఉంటారని సంగతి మర్చిపోవద్దన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ఈ సందర్భంగా బుడగజంగా సంఘ సభ్యులు కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్,మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిలను శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, నాయకులు కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ గంగుల గంగారం, వైస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, న్యాయవాది భూషణ్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, నాయకులు ఎజాస్, ఎమ్మార్పీఎస్ సంఘ నాయకులు మైసయ్య, కుమ్మరి రాజు, ప్రశాంత్, అమీర్ చావుస్, రామా గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాలను యదేచ్ఛగా కబ్జా చేస్తున్న పట్టించుకోని యంత్రాంగం

**- అనుమతులు లేకుండా యధేచ్ఛగా ఇండ్ల నిర్మాణాలు..**




**కబురు న్యూస్, బాన్సువాడ నవంబర్ 15**
బాన్సువాడ గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా మారినప్పటి నుండి భూముల ధరలు అమాంతం పెరగడంతో చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు బాన్సువాడలో ప్లాట్లు తీసుకోవాలని ఆశ పడుతుండగా మరి కొంతమంది ఆశావాహుల అవకాశాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ స్థలాలను సైతం కబ్జా చేస్తూ యదేచ్ఛగా ఇంటి నిర్మాణాలు చేస్తున్న సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రభుత్వ స్థలాలు అన్యక్రాంతమవుతున్నాయని పలువురు బహటంగానే ఆరోపిస్తున్నారు. బాన్సువాడ పట్టణంలో సుమారు 1100 కు పైగా డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు జరగడంతో ఖాళీ స్థలాల్లో రాజకీయ పలుకుబడి ఉన్న నాయకులు వారి అనుచరులు వారి అడుగులకు మడుగులోత్తే వారికి ప్లాట్లను తమ సొంత భూముల నుండి పంచి ఇస్తున్నట్టుగా ప్లాట్లను వారికి కట్టబెడుతున్న చుట్టుపక్కల వారు సైతం వారిని ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల తాడ్కోల్ గ్రామ శివారులో గల కాలనీ,బీడి వర్కర్ కాలనీలలో గత ప్రభుత్వంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఖాళీ స్థలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేసుకున్న ఇండ్లను స్థానిక నాయకుని బంధువులకు, ఇతర రంగాల్లో పనిచేస్తున్న వారికి ఇండ్లను కట్టబెడుతున్నారని పలువురు బాహాటంగానే ఆరోపిస్తున్నప్పటికీ, వాటిపై ఫిర్యాదు చేయడానికి కాలనీవాసులు వెనుకంజ వేస్తున్నారు. తాము బాగుంటే చాలు ఇతరులు ఏమైపోతే మాకేంటి అని ఉన్న సమాజంలో మార్పు ఎలా మొదలవుతుందని, రక్షించాల్సిన వారే ప్రభుత్వ స్థలాలను భక్షిస్తే తాము ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేని పరిస్థితి నెలకొంది.

## నేటి నుంచి ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ




**కబురు న్యూస్,నిజామాబాద్ నవంబర్ 15 :**
నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ లోని క్లబ్ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు క్లబ్ కార్యదర్శి చిలివేరి సత్యనారాయణ తెలిపారు.క్లబ్ లో శుక్రవారం సంయుక్త కార్యదర్శి వెంకట్ రాములు,కోశాధికారి గంగాకిషన్ తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొననున్నారని,శనివారం నిర్వహించనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్,క్లబ్ అధ్యక్షుడు రాజీవ్ గాంధీ హనుమంతు హాజరవుతారన్నారు.క్లబ్ ఉపాధ్యక్షుడు,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ అధ్యక్షత వహించనున్నారని,అతిథులుగా క్లబ్ ఉపాధ్యక్షులు నిజామాబాద్ ఇన్ చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ,అదనపు జిల్లా కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొననున్నారని తెలిపారు.ఆదివారం సాయంత్రం నిర్వహించనున్న ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, అతిథులుగా పోలీస్ కమిషనర్ సింధు శర్మ,అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొంటారని,తాహెర్ బిన్ హందాన్ అధ్యక్షత వహిస్తారన్నారు.దేశానికి స్వాతంత్ర్య రాకముందే నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఏర్పాటు చేశారని,దశాబ్దాల చరిత్ర ఉన్న క్లబ్ జిల్లా చరిత్రలో తనకంటూ ప్రత్యేకత కలిగి ఉందన్నారు.క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయడం,రాష్ట్ర,జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనే విదంగా క్రీడాకారులను తయారు చేయడమే బ్యాడ్మింటన్ టోర్నీ లక్ష్యమని సత్యనారాయణ తెలిపారు.సమావేశంలో క్లబ్ సభ్యుడు బీడీ దాస్,కిరణ్ కుమార్ గౌడ్,డాకం సాయిలు,డాక్టర్ రాములు,అరవింద్,రచ్చ మురళి, ఆశ నారాయణ,వీరేందర్ పర్మర్,శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ఏఈగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సంతోష్ కుమార్

**కబురు న్యూస్,బాన్సువాడ నవంబర్ 15**
బాన్సువాడ పట్టణ ఏఈగా సంతోష్ కుమార్ శుక్రవారం తన కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డి కమర్షియల్ సెక్షన్ నుండి సంతోష్ కుమార్ పదోన్నతిపై బాన్సువాడ పట్టణ ఏఈగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించడంతో కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.



## సమగ్ర కుల గణన సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలి...

**కబురు న్యూస్ బిచ్కుంద నవంబర్ 15**
బిచ్కుంద మండలంలోని శాంతాపూర్ గ్రామంలో శుక్రవారం సమగ్ర కుల గణ సర్వే కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఇంటింటికి తిరుగుతూ సమగ్ర కుల గణన సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనా సర్వేలో అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చి సర్వేకు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ ,నాయకులు అనంతరెడ్డి, శ్రీనివాస్ గౌడ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## నివర్తి రావును భారీ మెజార్టీతో గెలిపించాలి .. కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్



**- గ్రామ గ్రామాన తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించిన కార్పొరేషన్ చైర్మన్**

**కబురు న్యూస్ దేగ్లూర్ నవంబర్ 15**
దేగ్లూర్ నియోజకవర్గంలోని బీలోలి తాలుకలోని సవులి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ కాంగ్రెస్ అభ్యర్థి నివర్తి రావుకు మద్దతుగా గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అధికారంలో ఉన్న పార్టీని చేర్చి గద్దెనెక్కిన ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేకపోయిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి గెలిపించినట్లయితే పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నివర్తి రావు అందరికీ అందుబాటులో ఉంటూ సేవలు చేస్తారని ఆయనను ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, నాయకులు బుజ్జి, శంకర్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్రాన్ షకీల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బోధన్ లో ఘనంగా గురునానక్ జయంతి వేడుకలు...



**కబురు న్యూస్,బోధన్ నవంబర్15..**
బోధన్ పట్టణంలో సిక్కుల మత గురువు గురునానక్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సిక్కు మత గురు నానక్ జయంతి సందర్బంగా పట్టణంలోని రైల్వే గేట్ దగ్గర ఉన్న గురుద్వార ఆలయంలో సిక్కులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిక్కు మత మొదటి గురువు గురునానక్ జయంతి ని కార్తీక పౌర్ణమి రోజున జరుపుకుంటారు. సిక్కు మతాన్ని బలోపేతం చేయడంలో కీలకమైన పాత్ర పోషించిన వ్యక్తి గురునానక్ అని భక్తులు కొనియాడారు. కుల మత భేదాలతో సంబంధం లేకుండా అందరికి మానవత్వం, శ్రేయస్సు, సామాజిక న్యాయం కోసం నిస్వార్ధ సేవను చేసిన వ్యక్తి గురునానక్ అని కీర్తించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గురుద్వార్ కు విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



## నగర మేరు సంఘం కార్యవర్గానికి సన్మానం




**కబురు న్యూస్, నిజామాబాద్ నవంబర్ 15 :**
గత మూడు సంవత్సరాల కాలంలో నగర మేరు సంఘంకు తమ సేవలందించిన నగర మేరు కార్యవర్గానికి ఘనంగా సన్మానించారు.జిల్లా మేరు సంఘం భవనంలో నగర మేరు సంఘం ఉపాధ్యక్షులు దీకొండ సుధీర్,గట్ల సత్యం,సంయుక్త కార్యదర్శులు రాయి మోహన్,మాడిశెట్టి లక్ష్మణ్ ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు.ఈ సందర్భంగా నగర మేరు సంఘంకు ఎనలేని సేవలందించిన నగర అధ్యక్షులు మంతెన దశరథ్,కోశాధికారి యెన్ను సుదర్శన్ లకు కార్యవర్గం ఘనంగా సన్మానించింది.అనంతరం నగర అధ్యక్షులు దశరథ్ మాట్లాడుతూ,తమ శక్తివంచన లేకుండా మూడేళ్ళ పాటు సంఘం అభివృద్దికి కృషి చేసినట్లు తెలిపారు.సంఘం అభివృద్దికి ఎళ్లవేళాల పాటుపడుతామన్నారు.కృతజ్ఞత సభలో తమను సన్మానించిన నిజామాబాద్ మేరు అనుబంధ సంస్థలు శివాలయం,మేవ ,పంచాయతీ కమిటీ,టైలర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యవర్గానికి,10 తర్పల అధ్యక్ష,కార్యదర్శులు,కుల సభ్యులకు అందరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.అలాగే కులపెద్దలు కొట్టురు నరేందర్,రాచర్ల వెంకటేశం,కొట్టురు అంజయ్య,దికొండ లక్ష్మణ్, కొట్టురు గంగాధర్ లకు ధన్యవాదాలు తెలిపారు.

## కార్తీక పౌర్ణమి శోభను సంతరించుకున్న ఆలయాలు

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,నవంబర్ 15 :**
ఆలయాలు కార్తీక పౌర్ణమి శోభను సంతరించుకున్నాయి.శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి ఆలయాల్లో దీపాలు వెలిగించారు.నగరంలోని నీలకంఠేశ్వరాలయం ఆవరణలో భక్తులు పెద్ద సంఖ్యలో దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు.నగరంలోని వినాయక్ నగర్ కు చెందిన సిర్ప నరేశ్,లావణ్య దంపతులు శ్రీశైలంలో ప్రత్యేకంగా తయారు చేసిన కోటి వత్తుల దీపాన్ని తెప్పించి వెలిగిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ దీపాలను ప్రతి ఏడాది శ్రీశైలం నుంచి తెప్పించి వెలిగిస్తున్నట్లు పేర్కొన్నారు.



## సమగ్ర కుల గణన సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలి... కౌన్సిలర్

**కబురు న్యూస్, ఎల్లారెడ్డి నవంబర్ 15**
రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం వార్డులో జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటికి సర్వేకు వచ్చే ఎన్యుమారేటర్స్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి సర్వేను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహేశ్వరి, నాయకులు విద్యాసాగర్, ఎన్యుమారేటర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## డి.ఎస్.పి కి ఘన సన్మానం

**కబురు న్యూస్, కోరుట్ల: నవంబర్ 15**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి డివిజన్ డిఎస్పిగా బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్న ఏ .రాములు ను శుక్రవారం ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ కోరుట్ల, మెట్పల్లి డివిజన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు శాలువాతో సత్కరించి, స్వీటును అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు ,సంఘ రాష్ట్ర నాయకుడు బలిజ రాజారెడ్డి, ఉయ్యాల నరసయ్య, కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, బద్ది మురళీధర్, ఉయ్యాల శోభన్, నేరెళ్ల శ్రీధర్, మేకల హనుమాన్లు, గురు మంతుల నారాయణ తదితరులు ఉన్నారు.



# భక్తి శ్రద్ధలతో లక్ష దీపారాధన...







**కబురు న్యూస్,బోధన్ నవంబర్ 15..**
బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరంలో లక్ష దీపారాధన మహోత్సవ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని వేకువ జాము నుండి పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గణేష్ మహారాజ్ వేద మంత్రోచ్చారాణాల నడుమ ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లక్ష దీపారాధన మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, ధర్మకర్తలు, అర్చకులు మహేష్, శివ, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# శ్రీ చక్రేశ్వర శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు...





**కబురు న్యూస్,బోధన్ నవంబర్15..**
బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని స్వయంభూ శ్రీ చక్రేశ్వర స్వామి ని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాయకులు శరత్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ హరికాంత్ చారి తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- తూకం వేసిన 48 గంటల్లో రైతులకుద డబ్బులు అందేలా చూడాలి.
- తప్పులు లేకుండా సమగ్ర సర్వే నిర్వహించాలి
- ఎన్యుమరేటర్లు ప్రతీ ఇంటిని సందర్శిస్తూ పక్కాగా సమగ్ర సర్వే జరపాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**కబురు న్యూస్, సంగారెడ్డి నవంబర్ 15.**
ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం చౌటుకూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో దాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, ధాన్యం తూకం వేసిన రైతులకు 48 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాలో జమ అయ్యేలా వెంటనే టాబ్లెట్లు ఫీడ్ చేయాలని కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించిన రిజిస్టర్ లను కలెక్టర్ ఈ సందర్భంగా తనిఖీ చేసి, సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకొని, మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ధాన్యం బస్తాలను తూకం వేసిన వెంటనే ధాన్యం బస్తాల లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, సంబంధిత మిల్లులకు తరలించాలని ఆమె ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఎటువంటి అలసత్వం వహించరాదన్నారు. ఓపీఎంఎస్ లో రైతు పేరు, ఫోన్ నంబర్, ధాన్యం బస్తాలు, తదితర కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి తెలిపారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం జరిపించాలని, రైతులకు ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు రైతుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, రైతులు ధాన్యం ఆరబెట్టుకొని నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండే విధంగా చూసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు.

అనంతరం చౌటుకూర్ మండల కేంద్రంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణ కోసం నిర్వహిస్తున్న సమగ్ర సర్వే తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు . సర్వే ఫారంలోని ప్రశ్నావళి ప్రకారం నిర్ణీత నమూనాలో సమాచారాన్ని సేకరిస్తున్నారా లేదా అన్నది తనిఖీ చేశారు. ప్రతి కుటుంబంలోని ఒక్కో వ్యక్తి వారీగా పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఎన్యూమరేటర్ కు సూచించారు. ఇప్పటివరకు ఎన్ని ఇళ్లలో సర్వే పూర్తయ్యింది, కుటుంబ వివరాల సేకరణ సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఎదురయ్యాయా? కొత్తగా గమనించిన అంశాలు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు.

ఎన్యూమరేటర్లకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ, సర్వే ప్రక్రియను నిశ్శితంగా పర్యవేక్షణ చేయాలని సూపర్వైజర్లను ఆమె ఆదేశించారు. ప్రతీ ఎన్యుమరేటరు సమయానికి నిర్దేశించిన ఎన్యుమరేషన్ బ్లాకుల్లో సర్వేను చేపట్టాలన్నారు. సర్వే నిర్వహించే కుటుంబాల సభ్యులు ఎవరైనా అందుబాటులో లేనట్లయితే వారి గుర్తింపు పత్రాల ఆధారంగా వారి వివరాలు నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. సర్వేకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు తమ సమాచారం గోప్యంగా ఉంటుందని ప్రజలు ఇలాంటి ఆందోళన చెందకుండా అధికారులకు అడిగిన సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పుల్కల్ ఎస్ఐ క్రాంతి పాటిల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విహెచ్అర్ ఫౌండేషన్ సభ్యునికి చేయూత అందించిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి

**కబురు న్యూస్, పాలకుర్తి నవంబర్15:**
విహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు అందరూ కూడా మా ఇంటి సభ్యులు అని ఎవ్వరికీ ఎలాంటి ఆపద వచ్చిన వారికి అండగా ఉంటామని వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎన్ఆర్ఐ వ్యాళ్ల హరీష్ రెడ్డి అన్నారు.రామగుండం 30వ డివిజన్ విహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని వారికి వైద్య ఖర్చుల కోసం సహాయాన్ని అందించాలని ఫౌండేషన్ సభ్యులు, వ్యవస్థాపకులు హరీష్ రెడ్డికి చరవాణిలో సమాచారం అందించగా వారు వెంటనే స్పందించి వారి తండ్రి బిఆర్ఎస్ నాయకులు వ్యాళ్ల రాంరెడ్డి తో శ్రీనివాస్ వైద్యం కోసం ఇరవై వేల రూపాయలు సహాయం



అందిచాలని కోరగా వారు వేణు వెంటనే శుక్రవారం రోజున ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఇరవై వేల రూపాయలను వారికి అందిచి అండగా నిలిచారు. అంతేగాక ఈ నియోజకవర్గం లో ఎంతో మంది నిరుపేదలకు విహెచ్ఆర్ ఫౌండేషన్ ద్వారా సహాయాన్ని అందిచి నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందిన వ్యక్తిగా హరీష్ రెడ్డి పేరు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు వ్యాళ్ల రాంరెడ్డి మాట్లాడుతూ: ఎంతో మంది నిరుపేదలకు మా ఫౌండేషన్ ద్వారా మాకు తోచిన సాహయాన్ని అందిస్తున్నామని, అదేవిధంగా పలు సేవకార్యక్రమలు కూడా చేపట్టడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా వేయ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ: నేను అనారోగ్యంగా ఉండడంతో ఈ విషయాన్ని తెలుసుకొని మాకు తక్షణ సాహయంగా 20 వేల రూపాయలు అందించిన విహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాళ్ల హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ విహెచ్ఆర్ టీం సభ్యులతో పాటు,వివిధ డివిజన్ల ఫౌండేషన్ ఇన్చార్జ్లు, పాలకుర్తి మండల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఉద్యోగం సాధించిన యువకులకు సన్మానం



**కబురు న్యూస్, గన్నేరువరం :నవంబర్ 15**
ఇటీవల వెలువడిన నోటిఫికేషన్ గ్రూప్ ఫోర్ ఫలితాల్లో గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన ఘర్షకుర్తి నవీన్ జూనియర్ అసిస్టెంట్, ఘర్షకుర్తి అరుణ్ సాయి వార్డ్ ఆఫీసర్ గా ఉద్యోగం సాధించారు. వీరిని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి శుక్రవారం అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ యువత నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా ఎదగాలని అన్నారు. మండలంలోని యువత ఉన్నంత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భూమాడి కిరణ్ రెడ్డి, కర్షకుర్తి ప్రవీణ్, కూన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## అవోపా ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కు పుల్లూరినవీన్ కు సన్మానం.



**కబురు న్యూస్, మెట్ పల్లి, నవంబర్ 15.**
జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలోని మార్కెట్ యార్డు కమిటీలో డైరెక్టర్ గా పుల్లూరు నవీన్ ఎన్నికైనందున శుక్రవారం ఆవోప ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షులు బండారి సదా శివ కుమార్, కార్యదర్శి పాంపట్టి అనిల్, పడిగెల శ్రీనివాస్, చిలమంతుల శివ కుమార్, చిటికేసి మహేష్, గందె హరిప్రసాద్, గుండా శివ పాల్గొన్నారు .

# అర్బన్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్ .




**కబురు న్యూస్, , మెట్ పల్లి, నవంబర్ 15.**
జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలోని అర్బన్ది కాలనీలో నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మెట్ పల్లి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం సమాచారం మేరకు మెట్పల్లి ఎస్సై చిరంజీవితో పాటు సిబ్బందితో అర్బన్ కాలానికి వెళ్ళగా అక్కడ అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు మెట్పల్లి పట్టణానికి చెందిన పోతు అక్షయ్, బండి సాయిరాం అనే వ్యక్తులు కనిపించడం తో వారిని తనిఖీ చేయగా ఒక కవర్లో నిషేధిత గంజాయి ఉండగా ఇద్దరిపంచులను పిలిపించే వారి సమక్షంలో అతి గంజాయిని తూకం చేయగా 200 గ్రాముల గంజాయి ఉన్నట్లు సిఐ పేర్కొన్నారు . అట్టి గంజాయిని పంచుల సమక్షంలో పంచనామ రాసి స్వాధీనపరుచుకొని , తదుపరి చర్య నిమిత్తం అట్టి గంజాయిని వారి వద్ద ఉన్న రెండు సెల్ ఫోన్లను స్వాధీనపరుచుకున్నట్లు సిఐ తెలిపారు. ఇద్దరిని పోలీస్ స్టేషన్ తీసుకొని వచ్చి వారిపై కేసు నమోదు చేసే తదుపరి చర్య నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తామని అన్నారు ఇట్టి సమావేశంలో మెట్పల్లి ఎస్ఐ చిరంజీవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఇకనుండి మెట్పల్లి సర్కిల్ పరిధిలోని మెట్పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలంలోని గ్రామాలలో ఎవరైనా నిషేధిత మత్తు పదార్థములను అమ్మినట్లయితే మాకు వెంటనే సమాచారం ఇవ్వాలని సీఐ నిరంజన్ రెడ్డి అన్నారు. మేము వెంటనే స్పందించి నేరస్తులను పట్టుకుని కఠినంగా శిక్ష ఇస్తామని ఇస్తామని మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## మాజీ సర్పంచ్ భర్త అట్రాసిటీ కేసులో రిమాండ్.

**కబురు న్యూస్, మెట్ పల్లి, నవంబర్ 15.**
ఇబ్రహీంపట్నం మండలం వేముల కుర్తి గ్రామానికి చెందిన సున్నం సత్యంపై అట్రాసిటీ కేసలో గురువారం సాయంత్రం రిమాండ్ కు పంపినట్లు మెట్పల్లి డిఎస్పి ఏ రాములు తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం వేముల కూ ర్తి గ్రామానికి చెందిన లక్ష్మీపై మాజీ సర్పంచ్ భర్త సున్నం సత్యం అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ తన ఇంటిపై దాడి చేశాడని లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డిఎస్పి రాములుతెలిపారు.

## కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలలో పాల్గొన్న కంటెస్టడ్ కార్పోరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్



**కబురు న్యూస్, కుత్బుల్లాపూర్ నవంబర్ 15**
పవిత్రమైన కార్తీక పౌర్ణమి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నేత,కంటెస్టడ్ కార్పోరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గాజులరామరం 125 డివిజన్ పరిధిలోని శ్రీ నల్లగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా...సముహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూన శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం కమిటీ శ్రీనివాస్ గౌడ్ ని సన్మానించారు. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామివారి కృపకు పాత్రులు కాగలరని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమర ఇంద్రసేన గుప్తా , కూన రవీందర్ గౌడ్ , కమిటీ సభ్యులు ఆర్ బాలరాజు ,పెంటా రెడ్డి, శ్రీరాములు ,ఆర్ యాదగిరి ,యాము సాగర్, నరసింహారెడ్డి, పెంటారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సంజీవరెడ్డి,కూన రాఘవేంద్ర గౌడ్, మోహన్ రెడ్డి సురేష్, నాగిళ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.......

## ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు శివాలయాలకు పోటెత్తిన భక్తులు



**కబురు న్యూస్, కుత్బుల్లాపూర్, నవంబర్ 15**
కార్తీక పౌర్ణమి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శైవ క్షేత్రాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయాల్లో శివపార్వతులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సన్నిధానంలో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు......

## కార్తీక పౌర్ణమి వ్రతాల దీపారాధనలు



**కబురు న్యూస్, వర్గల్ నవంబర్ 15,**
సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్ట, శ్రీ లక్ష్మీనరసింహ క్షేత్రంలో కార్తిక పౌర్ణమి మహోత్సవాన్ని నాచారం గుట్ట లక్ష్మీ నరసింహ క్షేత్రం సర్వసన్నదమైంది కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని అశేష సంఖ్యలో స్వామివారిని భక్తులు దర్శించుకోవడం జరిగింది ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విడతల వారీగా 240 జంటల సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి సామూహిక కార్తీకదీపం తో ఆలయం లో శివుడూ ప్రీతికారమైన కార్తీక మాసంలో నదిస్నానం వ్రతాచరణ దీపారాధన అత్యంతంగా భావించారు ఈ కార్యక్రమంలో కార్తీక పౌర్ణమి పర్వదినం రోజున రాష్ట్ర నలుమూల నుంచి క్షేత్రానికి వచ్చి భక్తులు పోటెత్తారు ఇట్టి కార్యక్రమంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్ అన్నపూర్ణ ,పర్యవేక్షణలో సిబ్బంది సుధాకర్, పాండు ,నరేందర్ గౌడ్ ,తగిన ఏర్పాటు చేశారు

## రైతుల పండించిన దాన్యం కొనుగోలు సాఫీగా జరగాలి

:- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**కబురు న్యూస్,భువనగిరి నవంబర్ 15**
రైతుల పండించిన ధాన్యాన్ని ఏ యొక్క గింజ కూడా వదలకుండా దాన్యం కొనుగోలు సాఫీగా జరగాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.శుక్రవారం భువనగిరి మండలం లోని నందనం గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా



కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో 372 కొనుగోలు కేంద్రాల ద్వారా ఈరోజు వరకు 9302 మంది రైతుల దగ్గర నుండి 97,812 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడమైనది. దానిలో 88 845 టన్నుల ధాన్యాన్ని జిల్లా మిల్లర్లకు అందజేయడమైనది. జిల్లాలో మొత్తం 226 కోట్ల విలువైన ధాన్యం సేకరణ జరిగింది , దానిలో ఇప్పటివరకు 76 కోట్ల రూపాయలను 3046 మంది రైతులకు వారి వారి ఖాతాల్లో జమ చేయడం జరిగింది.రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్లోడ్ చేసి రైతుల యొక్క వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు. నమోదు ప్రక్రియ జరుగుతుందా లేదా అని రిజిస్టర్ ను పరిశీలించారు. రైతులు తెచ్చే దాన్యం నిబంధనల ప్రకారం తేమ శాతం స్వయంగా పరిశీలించి, రైతులకు అన్యాయం జరగకుండా మద్దతు ధర కల్పించాలని, తూకంలో ఎలాంటి జాప్యం జరగకుండా ఉండాలని, రైతులకు ఏ ఇబ్బంది కలగకుండా దాన్యం కొనుగోలు చేసి, కాంటా వేసిన వెంటనే మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్

– మాజీ ఎంపీటీసీ జ్యోతి స్వామి

**కబురు న్యూస్, గజ్వేల్ నవంబర్ 15,**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొల్గురు మాజీ ఎంపీటీసీ జ్యోతి స్వామి గజ్వేల్ లో మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం గడిచిన పదకొండు నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి వచ్చిందని బడికి పోయే పిల్లల నుండి పింఛన్లు అందుకునే అవ్వా తాతల దాకా రోడ్లు ఎక్కి నిరసనలు చేస్తున్నారు అంటే ఆ ఘనత రేవంత్ రెడ్డిదే అని అన్నారు.కేసీఆర్ బతుకమ్మ పండుగ వేల చీరెలు కేసీఆర్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు ఇచ్చిండు, చెరువుల్లో చేపలు వేసిండు. గొర్రెలు ఇచ్చిండు కేసీఆర్ ప్రభుత్వం పోయాక అన్నీ పోయాయని వాపోయారు.నేడు 10వేలు, రేపయితే 15వేల రైతు భరోసా అన్నరు. ప్రజలు నమ్మితే నట్టేట ముంచారని కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతు బంధు



ఆపలేదు మంత్రుల, ఎమ్మెల్యేల జీతాలు ఆపి మరీ రైతులకు రైతు బంధు ఇచ్చిండని గుర్తు చేశారు.ఇప్పుడు కరోనా లేదు ఎందుకు రైతు బంధు పడలేదు అధికారంలోకి వస్తే ఇస్తానన్న 15వేలు పడలేదు, కనీసం కేసీఆర్ ఇచ్చే పది వేలు పడలేదని రైతులను ఘోరంగా మోసం చేశారని అన్నారు.మహిళలకు 2500 అన్నడని బతుకమ్మ చీరెలకు 500 ఇస్తానీ ఎగ్గొట్టడని వృద్ధులకు 4వేల పింఛన్ ఇస్తా అని మాట తప్పిండు ఇచ్చే రెండు వేల పింఛన్ కూడా రెండు నెలలు ఇవ్వలేదని అన్నారు.ఓట్ల ముందు డిసెంబర్ 9 తారీఖు రుణమాఫీ అన్నడు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆగస్టు 15నాటికి పూర్తి చేస్తా అని దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు.ఈ రుణమాఫీ పైసలన్నా పడ్డయి అంటే బీఆర్ఎస్ పార్టీ నిలదీయడం వల్లనే అని గుర్తు చేశారు.పింఛన్లు, రైతులకు బోనస ,రుణమాఫీ ,తులం బంగారం విద్యార్థులకు జాబ్స్ ,మహిళలకు 2500 అన్నీ దగానే అని తెలిపారు. రాహుల్ గాంధీ ఎక్కడున్నావు, ఆరు గ్యారెంటీల బాధ్యత నాది అని చెప్పిన సోనియా గాంధీ ఎక్కడ అని కాంగ్రెస్ వికృత వైఖరి పట్ల గ్రామ గ్రామాన ప్రజలలో చర్చలు నడుస్తున్నాయని రైతులు, యువత అందరికీ అర్థం అవుతుందని అన్నారు.ఏది ఏమైనా ప్రస్తుతం కేసీఆర్ లేని లోటు తెలంగాణ రాష్ట్ర ప్రజలకి అర్థం అవుతుందని రానున్న రోజుల్లో ఇంకా బలమైన ప్రతిపక్ష పాత్ర పోషించి హామీలు నేరవేరేవరకు గట్టిగా పోరాటం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో పురం ఆంజనేయులు, స్వామి గౌడ్, పురం అనిల్, పాల్గొన్నారు

# మున్సిపల్ పారిశుద్ధ కార్మికులే ప్రత్యక్ష దైవాలు

:- పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్

**కబురు న్యూస్, భువనగిరి నవంబర్ 15**
మున్సిపల్ పారిశుద్ధ కార్మికులే ప్రత్యక్ష దైవాలని పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ అన్నారు. కార్తీక మాస కార్తీక పౌర్ణమి పండుగను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నాక్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో10,26,25,28 వార్డులోని మున్సిపల్ కార్మికులకు బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ప్రత్యక్ష దైవాలని వారి వల్లే పట్టణం పరిశుభ్రంగా ఉన్నదని అన్నారు. మున్సిపల్ కార్మికులను ప్రజలు నాయకులు ఉద్యోగులు గౌరవప్రదంగా మెలగాలని అన్నారు. పట్టణ ప్రజల పరిశుభ్రత ఆరోగ్యం కాపాడే క్రమంలో వారి పాత్ర



చాలా కీలకమని ఆయన అన్నారు. మున్సిపల్ కార్మికులను సిబ్బందిని తక్కువ చేసి చూడరాదని అన్నారు. మున్సిపల్ కార్మికులకు ట్రెజరీ ద్వారా జీతాలు ఇప్పించిన ఘనత నాటి కాంగ్రెస్ ప్రభుత్వాని దని అన్నారు. ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కృషి చేస్తామని మున్సిపల్ కార్మికులతో సిబ్బందితోనే పట్టణ అభివృద్ధి సాధ్యమని పట్టణ అభివృద్ధిలో వారి పాత్ర కీలకమని అన్నారు.ఈ కార్యక్రమంలో 26వ వార్డు కౌన్సిలర్ ఈరపాక నరసింహా, వార్డు పెద్దలు మాటూరి బాలేశ్వర్, పలుగుల ఆగేశ్వరరావు, నాయకులు రత్న రాజశేఖర్, బింగి నరేష్, పాలడుగు శేఖర్, భూపాల్ రెడ్డి, మున్సిపల్ జవాన్ శ్రీధర్, లైన్మెన్ విజయ్, మున్సిపల్ ఆటో కార్మికులు, పారిశుద్ధ సిబ్బంది శంకర్ నాయక్, కొండయ్య, రాములు నాయక్, శంకర్, ప్రవీణ్, మహిళా కార్మికులు సునీత ,ఎల్లమ్మ,

# ఈ నెల 17,18 వ తేదీలలో గ్రూప్ -3 పరీక్షలు పగడ్బందీగా జరిపించాలి

:-యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

**కబురు న్యూస్, భువనగిరి నవంబర్ 15**
ఈ నెల 17,18 వ తేదీలలో గ్రూప్ -3 పరీక్షలు జరుగుచున్నందున భువనగిరి పట్టణంలోని దివ్య బాల స్కూలులో ఏర్పాటుచేసిన సెంటర్ ను శుక్రవారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు పరిశీలించారు

**అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ కీలక సూచనలు**
ఈ నెల 17,18 తేదీ లలో గ్రూప్ -3 పరీక్ష జరుగుతున్నందున పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే ( ఉదయం 9 గంటల 30 నిమిషాలకు, మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు) పరీక్ష కేంద్రాల గేట్లు మూసి వేయడం జరుగుతుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు తమ సెంటర్లను ఒక్కరోజు



ముందుగానే చూసుకోవాలన్నారు.
అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్ సైట్ ద్వారా గ్రూప్-3 హాల్ టికెట్ లు డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. పరీక్షార్థులు హాల్ టికెట్ ను ఏ4 సైజ్ పేపర్ లో కలర్ ప్రింట్ తీసుకోవాలని సూచించారు. హాల్ టికెట్ పై అభ్యర్థులు తమ తాజా పాస్ పోర్టు ఫోటోను అతికించాలన్నారు. డౌన్లోడ్ చేసిన హాల్ టికెట్ పై ఫోటో సరిగా ముద్రించి లేకుంటే, అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపల్ అటెస్ట్ తో మూడు పాస్ పోర్టు ఫోటోలతో పాటు వెబ్ సైట్ లో పొందుపరిచిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తిచేసి ఇన్విజిలేటర్ కు అందించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే (9:30 గంటలకు) గేట్లు మూసివేస్తామని, పరీక్ష రాసే అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలని, అభరణాలు ధరించరాదని సూచించారు. పరీక్షార్థులు మెహిందీ, తాత్కాలిక టాటూలను వేసుకోరాదని స్పష్టం చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్ ను, బ్లూ (లేదా) బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తో పాటు గుర్తింపు పొందిన ప్రభుత్వ ఒరిజినల్ ఐడెంటిటీ కార్డును తప్పనిసరిగా తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. పరీక్ష సమయ పాలనకు సూచికగా ప్రతీ అర్థగంటకోసారి బెల్ మోగుతుందని తెలిపారు.

# రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

:-భువనగిరి యాదాద్రి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**కబురు న్యూస్, భువనగిరి నవంబర్ 15**
రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు.శుక్రవారం రామన్నపేట మండలంలోని తుమ్మల గూడెం గ్రామంలో ఐకెపి మరియు పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తెచ్చే ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రైతుల వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేస్తున్నారా లేదా అని రిజిస్టర్ ను చూశారు. రైతులు పండించిన ధాన్యం మిల్లులకు ఆరబెట్టుకొని తేవాలని, నిబంధన ప్రకారం తేమ శాతం ఉండేలా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. తూకంలో



జాప్యం జరిగితే చర్యలు తప్పవన్నారు. తూకం వేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు రైతుల వివరాలు ఆన్లైన్లో ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. రైతులను ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కొనుగోలు ఎలా జరుగుతుంది అని అడిగి తెలుసుకున్నారు.అనంతరం వలిగొండ మండలంలోని నాగారం గ్రామంలో ఉన్న వాసవి రైస్ మిల్లును అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. వచ్చిన ధాన్యాన్ని త్వరగా అన్లోడ్ చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు.రైస్ మిల్లులో ధాన్యం దిగుమతులలో జాప్యం లేకుండా చూడాలని రైస్ మిలర్లకు ఆదేశించారు. ఏమైనా సమస్యలు వస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తహసిల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సుషీల్ కుమార్ షిండేతో సమావేశమైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

కబురు న్యూస్, డెస్క్ : నవంబర్ 15

- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- తెలంగాణ ప్రజలున్న షోలాపూర్ లో మంత్రి ప్రచారానికి అపూర్వ స్పందన
- అడుగడుగునా జై జై లతో స్వాగతం పలుకుతున్న తెలుగు ప్రజలు
- తెలంగాణ పథకాలు.. మహారాష్ట్రలోనూ అమలు కావాలని నినాదాలు
- రాబోయేది కాంగ్రెస్ కూటమే.. అండగా ఉండాలని ప్రజల్ని కోరుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- ఎవ్వరు ఎన్ని చెప్పినా.. మా ఓటు చెయ్యి గుర్తుకే అంటూ మహా ప్రజల అభయం
- మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్రమంత్రి సుషీల్ కుమార్ షిండేతో సుదీర్ఘ సమావేశం
- మంత్రి ప్రచారసరళి చూసి సంతోషంవ్యక్తం చేసిన ప్రణితీ షిండే, సుషీల్ కుమార్ షిండే
- ఒక్క క్షణం విశ్రాంతి లేకుండా ప్రజల్లోనే ఉంటున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.
- మంత్రి వెంట ప్రచారంలో పాల్గొన్న జడ్చెర్ల శాసనసభ్యులు జనంరెడ్డి అనిరుద్ రెడ్డి.

మహారాష్ట్ర ఎన్నికల్లో ఈసారి కాంగ్రెస్ పార్టీ కూటమి బంపర్ మెజార్టీతో గెలిచి అధికారం చేపట్టబోతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, షోలాపూర్ పార్లమెంట్ సభ్యురాలు ప్రణితి షిండేతో కలిసి రెండు రోజులుగా ఎన్నికల ప్రచారంలో



పాల్గొంటున్న మంత్రి.. కాంగ్రెస్ పార్టీ పట్ల మహా ప్రజల్లో ఆదరణ బాగుందని.. ఎక్కడికెళ్లినా కాంగ్రెస్సే కావాలని ప్రజలు ఎదురేగి స్వాగతం పలుకుతున్నారని ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ రోజు ఉదయం మొదటి దఫా ప్రచారం పూర్తి చేసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి సుషీల్ కుమార్ షిండేతో సమావేశమయ్యారు. రెండు రోజులుగా మహారాష్ట్రలోని షోలాపూర్ నియోజకవర్గంతో పాటు వివిధ నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి.. తన ప్రచార అనుభవాలను సుషీల్ కుమార్ షిండేతో పంచుకున్నారు. ప్రచారం సరళి, ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ గురించి వివరించారు. తెలంగాణకు చెందిన అనేక జిల్లాల నుంచి వచ్చిన చేనేత, యాదవ, కురుమ సోదరులు కాలనీలను ఏర్పాటు చేసుకున్నారని.. అక్కడికి వెళ్లగానే వారు అపూర్వ స్వాగతం పలికిన తీరు సంతోషం కలిగించిందని ఈ సందర్భంగా మంత్రి షిండేకు వివరించారు.



తెలంగాణలో అమలవుతున్న పథకాలు మహారాష్ట్రలోనూ అమలు కావాలని ఇక్కడి ప్రజలు బలంగా కోరుకుంటున్నట్లు మంత్రి సుషీల్ కుమార్ షిండే దృష్టికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమానికి పట్టంకట్టే పార్టీ అని.. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులు ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకుల్తేనని ప్రజలకు వివరించినట్టు ఆయన చెప్పారు. ప్రచారంలో ప్రజల స్పందన చూస్తుంటే కాంగ్రెస్ కూటమి బంపర్ మెజార్టీతో గెలవబోతుందనేది స్పష్టంగా కనిపిస్తుందని ఆయన తెలిపారు.

తెలంగాణకు షోలాపూర్ కు విడదీయలేని బంధం ఉందని, అత్యధిక జనాభా తెలంగాణ ప్రాంతానికి చెందినవారేనని సుషీల్ కుమార్ షిండే ఈ సందర్భంగా చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమావ్యక్తం చేశారు. ప్రచారంలో ఏ ప్రాంతాన్ని వదిలిపెట్టకుండా ప్రచారం నిర్వహిస్తూ పార్టీ గెలుపు కోసం శ్రమిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ఈ సందర్భంగా సుషీల్ కుమార్ షిండే అభినందించారు.

## టూరిజం ప్రమోషన్ కోసం త్వరలోనే నూతన కమిటీ

తెలంగాణకు వచ్చే దేశ విదేశీయులను పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడం లక్ష్యం

ట్రవెర్నియా ఫెస్ట్ లో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



తెలంగాణ రాష్ట్రానికి వచ్చే దేశ విదేశీయులు.. పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ కట్టడాలు, చారిత్రక ప్రాంతాలను సందర్శించే విధంగా టూరిజం ప్రమోషన్ కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టబోతుందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. దీనికి సంబంధించి కార్యచరణ రూపొందిస్తున్నామని, త్వరలోనే ఓ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మాదాపూర్ లోని హైటెక్స్ లో నిర్వహించిన ట్రవెర్నియా ఫెస్ట్ కు ముఖ్యతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతిప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పర్యాటక, వారసత్వ, చారిత్రక ప్రాంతాలు, ఆయా ప్రాంతాల ప్రజల జీవన శైలి, ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సాంప్రదాయలను గురించి సమగ్ర సమాచారాన్ని పర్యాటక ప్రేమికులకు తెలియజేయడం లక్ష్యంగా ట్రవెర్నియా ఫెస్ట్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. సీయం రేవంత్ రెడ్డి సారధ్యంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ పర్యాటక రంగానికి పెద్దపీట వేసిందన్నారు. పర్యాటకులతో పాటు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలు, అధికారిక కార్యక్రమాలు, ఆయా పనుల నిమిత్తం తెలంగాణకు వచ్చే వారిని పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకు అనేక పథకాలు చేపడుతున్నామని చెప్పారు. వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. తెలంగాణ టూరిజం ప్రమోషన్ కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలను సందర్శించి, టూరిజం ప్రమోషన్ కు అంబాసిడర్లుగా నిలవాలని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఎన్ టూరిజం అంబాసిడర్ కార్ల్ జోషువా, ప్రముఖ చరిత్రకారుడు డా. సిన్హారాజా తమ్మిట, ట్రవెర్నియా ఫెస్ట్ వ్యవస్తాపకులు డా. అంతొని విపిన్ దాస్, రవాణా పరిశ్రమ, ట్రావెల్ ఎజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థ, గంజాయి మాఫియాకు చెక్ పెట్టేలా, బాల్యం నుంచే దేశభక్తిని అలవరుసుకునేలా"అభినవ్ " చిత్రాన్ని రూపొందించాను - ప్రముఖ దర్శక నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్

కబురు న్యూస్, డెస్క్ : నవంబర్ 15

"ఆదిత్య", "విక్రీస్ డ్రీమ్", "డాక్టర్ గౌతమ్" వంటి సందేశాత్మక బాలల చిత్రాలతో పసి మనసుల్లో మంచి నాటే ప్రయత్నం చేసి ఎంతోమంది పిల్లల, తల్లిదండ్రుల ప్రశంసలతో పాటు జాతీయ అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు దర్శక నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్. ఆయన శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సమర్పణలో సంతోష్ ఫిలిమ్స్ బ్యానర్ పై రూపొందిస్తున్న మరో బాలల లఘు చిత్రం "అభినవ్ "(chased padmavyuha). ఈ చిత్రంలో సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్, గీతా గోవింద్, అభినవ్, చరణ్, బేబీ అక్షర కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా పాత్రికేయ సమావేశాన్ని తాజాగా హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా

దర్శక, నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ – ఈ రోజు మా "అభినవ్ "(chased padmavyuha)) చిత్రం ప్రెస్ మీట్ లో అతిథులుగా పాల్గొన్న పెద్దలందరికీ కృతజ్ఞతలు. పిల్లల్లో చిన్నప్పటి నుంచే దేశభక్తిని రూపొందించాలనే లక్ష్యంతో ఈ సినిమాను రూపొందించాను. విదేశాల్లో పిల్లలకు చిన్నప్పటి నుంచే దేశ రక్షణ విషయంలో అవగాహన కల్పించి, శిక్షణ ఇస్తుంటారు. అలా మన పిల్లలను కూడా తీర్చిదిద్దాలి. దురదృష్టవశాత్తూ పిల్లలు గంజాయి వంటి వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. డ్రగ్ మాఫియా మన గ్రామీణ ప్రాంతాల్లోనూ బాగా విస్తరించింది. ఎన్ సీసీ, స్పోర్ట్స్, యోగ, ధ్యానం నేర్చుకోవడం ద్వారానే పిల్లలు ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండగలరు. దేశ రక్షణలో భాగం కాగలరు. ఇలాంటి స్ఫూర్తికరమైన అంశాలతో బాలలను గొప్ప మార్గంలో పయనించేలా ఉత్తేజపరుస్తూ "అభినవ్ "(chased padmavyuha)) చిత్రాన్ని రూపొందించాం. ఈ చిత్రాన్ని అన్ని ఫిలిం ఫెస్టివల్స్ కు పంపించాం. అలాగే నేషనల్ అవార్డ్స్ కు పంపిస్తున్నాం అన్నారు.

సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ – దర్శక నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ గారు నేటి బాలలే రేపటి పౌరులు అనే విషయాన్ని గట్టిగా నమ్ముతారు. పిల్లలకు సినిమా మాధ్యమం ద్వారా మంచిని చెప్పి వారిని గొప్ప



పౌరులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. "అభినవ్ "(%ఎష్ఘుంవస జూఖుఎఝజఎబష్ఘు%) వంటి గొప్ప సినిమాను రూపొందించిందుకు సుధాకర్ గౌడ్ గారికి నా అభినందనలు తెలియజేస్తున్నా. పిల్లల్లో స్ఫూర్తినింపే ఇలాంటి మరిన్ని చిత్రాలు సుధాకర్ గౌడ్ గారి ద్వారా రావాలని కోరుకుంటున్నా అన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ ప్రాజెక్ట్ ఛైర్మన్ విజయభాస్కర్ మాట్లాడుతూ – మా రెడ్ క్రాస్ నుంచి యాంటీ నార్కొటిక్ సెమినార్స్ నిర్వహిస్తుంటాం. డ్రగ్స్ ద్వారా మన పిల్లల్ని పాడుచేయడం ఉగ్రవాద చర్యగానే భావించాలి. పిల్లలను సన్మార్గంలో పెట్టేలా భీమగాని సుధాకర్ గౌడ్ గారు తన సినిమాల ద్వారా చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. "అభినవ్ "(chased padmavyuha) మంచి ఆదరణ పొందాలని కోరుకుంటున్నా అన్నారు.

నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ – కమర్షియల్ కంటెంట్ తో సినిమాలు తీయడం సులువు. కానీ "అభినవ్ "chased padmavyuha) లాంటి కంటెంట్ ను తెరపైకి తీసుకురావడం చాలా కష్టం. అలాంటి గొప్ప ప్రయత్నం చేస్తున్నారు సుధాకర్ గౌడ్ గారు. ఈ చిత్రం ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి సుధాకర్ గౌడ్ గారికి ప్రశంసలు దక్కుతాయి అన్నారు.

నిర్మాత లయన్ సాయివెంకట్ మాట్లాడుతూ – పిల్లలకు మంచి సందేశాన్నిచ్చేలా "అభినవ్ " chased padmavyuha) లాంటి సినిమా చేసినందుకు సుధాకర్ గౌడ్ గారికి అభినందనలు. డబ్బు కోసం కొందరు ఏవేవో సినిమాలు చేస్తుంటారు. కానీ "అభినవ్ "(chased padmavyuha) లాంటి మంచి సినిమాలు చేస్తే దక్కే సంతృప్తి వేరు. సుధాకర్ గౌడ్ గారు ఈ సినిమాకు అనేక బాధ్యతలు వహించారు. ఆయన ఇలాంటి మంచి ప్రయత్నాలు మరిన్ని చేయాలని కోరుకుంటున్నా అన్నారు.

నటుడు బాలాజీ మాట్లాడుతూ – సుధాకర్ గౌడ్ గారు "అభినవ్ "(chased padmavyuha) సినిమా తనకోసం రూపొందించలేదు. పిల్లల కోసం రూపొందించారు. చెడు ఏ రూపంలో ఉన్నా అది కీడు చేస్తుందని పిల్లలకు చెప్పాలి. చిన్నప్పుడు అన్నం తినకుంటే బూచి వస్తుందని చెప్పేవాళ్లం. అలాగే డ్రగ్స్ కానీ ఇతర ఏ మత్తుపదార్థాలైనా జీవితాలను పాడుచేస్తాయని ఈ చిత్రం ద్వారా పిల్లలకు చెప్పే మంచి ప్రయత్నం చేసిన సుధాకౌర్ గౌడ్ గారికి అభినందనలు తెలియజేస్తున్నా అన్నారు.

సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీపూజ మాట్లాడుతూ – నేను తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో తరుపున సెమినార్స్, వర్క్స్ చేస్తుంటాము. సుధాకర్ గౌడ్ గారిని నేను చిల్డ్రన్ ఫిలిం ఫెస్టివల్ టైమ్ లో ఐమ్యాక్స్ లో కలిశాను. ఆయన సినిమాల గురించి తెలిశాక మీరు డ్రగ్స్ ఎఫెక్ట్ గురించి మూవీ చేయొచ్చు కదా అని అడిగాను. ఆయన "అభినవ్ "(chased padmavyuha) సినిమా ఆ కాన్సెప్ట్ తోనే చేస్తున్నామని చెప్పారు. ఇలాంటి మంచి మూవీ చేసి ఎంతోమంది పిల్లల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్న సుధాకర్ గౌడ్ గారికి నా అభినందనలు అన్నారు.

నటీనటులు – సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్, గీతా గోవింద్, అభినవ్, చరణ్, బేబీ అక్షర, తదితరులు

టెక్నికల్ టీమ్ – కెమెరా – సామల భాస్కర్, సంగీతం – వందేమాతరం శ్రీనివాస్, ఎడిటర్ – నందమూరి హరి, పీఆర్ఓ – చందు రమేష్, సమర్పణ – శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, బ్యానర్ – సంతోష్ ఫిలిమ్స్, నిర్మాత, దర్శకత్వం – భీమగాని సుధాకర్ గౌడ్.

## హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్యుల నిర్లక్ష్యానికి పసికందు మృతి..





### ఆసుపత్రి వద్ద మృత శిశువుతో బంధువుల ఆందోళన... పోలీసులకు ఫిర్యాదు....

కబురు న్యూస్, డెస్క్ : నవంబర్ 15

ప్రసూతి వైద్యం కోసంహుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే అక్కడ వైద్యుల నిర్లక్ష్యానికి గర్భ శిశువు బలైంది.బాధితులు తెలిపిన కథనం ప్రకారం .. వివరాల్లోకి వెళితే.....కరీంనగర్ కు చెందిన కళ్లెం లక్ష్మి ప్రెగ్నెన్సీ డెలివరీ కోసం హుజరాబాద్ బుడిగ జంగ కాలనీలోని తన తల్లి గంధం రాజేశ్వరి వద్దకు వచ్చి, . ఇక్కడే ఉంటూ రెగ్యులర్ గా హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటుంది. లక్ష్మికి గురువారం రోజున సాయంత్రం పురిటినొప్పులు రావడంతో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్తే . వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పిన వైద్యులు సమయానికి చికిత్స చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పుట్టిన ఆడ శిశువు మృతి చెందిందని బాధితురాలి బంధువులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం రాత్రి మృతి చెందిన శిశు మృతదేహంతో బాధితురాలు లక్ష్మీ భర్త కళ్లెం నాగరాజు, తల్లి రాజేశ్వరి, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. తమ పురిటి బిడ్డ మృతికి కారణమైన హుజరాబాద్ ప్రభుత్వ వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు తల్లి రాజేశ్వరి సర్కిల్ ఇన్స్పెక్టర్ కు ఫిర్యాదు చేశారు.

## సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్

కబురు న్యూస్, డెస్క్ : నవంబర్ 15

సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇంచార్జీ ఆడెం సంతోష్ తో కలిసి మెట్టుగూడ రైల్వే మెకానిక్ వర్క్ షాప్ వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయాన్ని సందర్శించిన రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్..

రైల్వే యూనియన్ నేతలు కార్మికులతో బాగోగులు సమస్యలు తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్..మంత్రి పొన్నం ప్రభాకర్ డిసెంబర్ 5 వ తేదిన జరిగే సౌత్ సెంట్రల్ రైల్వే ఎన్నికల్లో ఏం రాఘవయ్య గారి పనెల్ రైలు ఇంజన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నా .. అందరి సంక్షేమం కొరకు ప్రభుత్వం కష్టపడుతోంది..ముఖ్యంగా సికింద్రాబాద్ కి సంబంధించి జోన్ లో ఉన్న రైల్వే లో అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుంది..తెలంగాణ ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది..హైదరాబాద్ ఇన్చార్జి మంత్రిగా సికింద్రాబాద్ ఓటరు మహాశయులకు విజ్ఞప్తి చేస్తున్నా..ఈ రిజన్ కి సంబంధించి మిత్రుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు అడెం సంతోష్ అభ్యర్థిగా ఉన్నారు.. ఎం రాఘవయ్య ప్యానెల్ ఓటు వేసి గెలిపించాలి..





# నయన ప్రేమకథ అలా మొదలైంది..?

కబురు సినిమా నవంబర్ 15..

అగ్ర నాయిక నయనతారను ఆమె అభిమానులు లేడీ సూపర్‌స్టార్ అని గర్వంగా పిలుచుకుంటారు. బుల్లితెర ప్రయోక్తగా కెరీర్‌ను మొదలుపెట్టి అగ్ర కథానాయికగా ఎదిగిన ఆమె ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఈ నేపథ్యంలో 'నయనతార: బీయాండ్ ది ఫెయిరీటేల్' పేరుతో ఆమె విజయవంతమైన సినీ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రూపొందిన డాక్యుమెంటరీ త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. ఇందులో ఆమె వ్యక్తిగత, సినీ జర్నీకి సంబంధించిన అనేక ఆసక్తికరమైన అంశాలను పొందుపరిచారు. తమిళ దర్శకుడు విఘ్నేష్ శివన్‌తో నయనతార ప్రేమాయణం, పెళ్లి వరకు సాగిన వారి ప్రయాణాన్ని కూడా ఈ డాక్యుమెంటరీలో వివరించారని తెలిసింది. ఈ సందర్భంగా విఘ్నేష్ శివన్‌తో తాను ప్రేమలో పడిన క్షణాలను నయనతార గుర్తు చేసుకుంది. విఘ్నేష్‌శివన్ దర్శకత్వం వహించిన 'నానుమ్ రౌడీదాన్' (2015) సెట్స్‌లో తొలిసారి వీరిద్దరూ కలుసుకున్నారు. నయనతార మాట్లాడుతూ 'పాండిచ్చేరిలోని ఓ మారుమూల ప్రాంతంలో షూటింగ్ పెట్టారు. విజయ్ సేతుపతి మీద సీన్స్ షూట్ చేస్తున్నారు. అప్పుడే నేను దూరంగా విఘ్నేష్ శివన్‌ను గమనించా. మోముపై చెరగని చిరునవ్వు, సన్నివేశాన్ని వివరించే శైలి, దర్శకుడిగా అతని ప్రత్యేకమైన పనితీరు నన్ను ఆకట్టుకుంది. ఆ క్షణంలోనే అతని ప్రేమలో పడిపోయా' అని నయనతార చెప్పింది. దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ ప్రేమాయణం అనంతరం 2022 జూన్ 9న ఈ జంట వివాహం చేసుకున్నారు. ఈ దంపతులు సరోగసీ విధానం ద్వారా ఉయిర్, ఉలగం అనే కవల పిల్లలకు తల్లిదండ్రులయ్యారు.

# సూర్య 44పై ఎంతో ఎక్జయింటింగ్

కబురు సినిమా నవంబర్ 15..



కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు డైరెక్ట్ చేస్తున్న సూర్య 44. ఈ సినిమా ఎలా ఉండబోతుందో ఓ ఇంటర్వ్యూలో కార్తీక్ సుబ్బరాజు క్లారిటీ ఇచ్చేశాడు. సూర్య 44 గ్యాంగ్‌స్టర్ మాత్రమే కాదు. ఇది చాలా యాక్షన్ పార్ట్‌తో కూడిన ప్రేమకథ. సూర్య అండ్ పూజా హెగ్డే లాంటి నటీనటులతో లవ్ స్టోరీ చేస్తున్నానని చాలా ఎక్జయిట్ అయ్యానంటూ చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ సినిమా ఎలా ఉండబోతుందో చెప్పకనే చెబుతూ సినిమా క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా.. పాపులర్ మాలీవుడ్ యాక్టర్ జోజు జార్జ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రానిక ఇసంతోష్ నారాయణన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పీరియాడిక్ వార్ అండ్ లవ్ నేపథ్యంలో రాబోతున్న ఈ మూవీకి తిరు, 24, పేటా ఫేం సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు. సూర్య హెూంబ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని మేకర్స్ 2025 పొంగళ్ కానుకగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు . ఈ మూవీకి సంబంధించి ఇప్పటికే అండమాన్ ఐలాండ్‌లో లాంగ్ షెడ్యూల్‌ను పూర్తి చేసిన టీం.. పోర్ట్ బ్లెయిర్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తోపాటు సూర్య, పూజాహెగ్డేపై వచ్చే సాంగ్స్‌ను చిత్రీకరించినట్టు ఇన్‌సైడ్ టాక్.

# దేవర-2పై అనుమానాలొద్దు

కబురు సినిమా నవంబర్ 15..



ఎన్టీఆర్ 'దేవర' సినిమా థియేటర్ రిలీజ్ 50 రోజులు పూర్తి చేసుకుంది. ఓటీటీ స్ట్రీమింగ్ తర్వాత థియేటర్‌లలో రన్ అయ్యి 50 రోజులు పూర్తి చేసుకున్న 'దేవర' సినిమా అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద రూ.500 కోట్లకు పైగా వసూళ్లు చేసిందని సమాచారం అందుతోంది. టాలీవుడ్ టాప్ చిత్రాల జాబితాలో నిలిచిన 'దేవర' సినిమాకు పార్ట్ 2 అవసరం లేదనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. దర్శకుడు కొరటాల శివ, హీరో ఎన్టీఆర్ సైతం అదే ఫీల్ అవుతున్నారేమో అంటూ కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఎన్టీఆర్ ఫ్యాన్స్ మాత్రం ఆ ప్రచారంను తిప్పి కొడుతున్నారు. రూ.500 కోట్ల వసూళ్లు సాధించిన సూపర్ హిట్ సినిమాకి సీక్వెల్ చేయకుండా ఎలా వదిలేస్తారంటూ వారు ప్రశ్నిస్తున్నారు.




# హాయ్.. నేను రానా దగ్గుబాటి..
## ట్రైలర్ షో విడుదల

కబురు సినిమా నవంబర్ 15..

టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గు బాటి కాంపౌండ్ నుంచి టాక్ షో సందడి చేయబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ది రానా దగ్గుబాటి షో ట్రైలర్‌ను విడుదల చేశారు. హాయ్.. నేను రానా దగ్గుబాటి.. అవును ఇది ఒక షో. కానీ మీరంతా ఈ షో దేని గురించి ఆశ్చర్యపోతున్నారు. నాకింకా ఏం తెలియదు.. అంటూ ఇంట్రో మొదలుపెట్టాడు రానా.ఆ తర్వాత షోలోకి గెస్టులుగా నాగచైతన్య, శ్రీలీల, సిద్దు జొన్నలగడ, నాని, ప్రియాంకా ఆరుళ్ మోహన్, ఎస్ఎస్ రాజమౌళి, తేజ సజ్జా దుల్కర్ సల్మాన్, రాంగోపాల్ వర్మ, మీనాక్షి చౌదరి, రిషబ్ శెట్టి లాంటి స్టార్లు ఎంట్రీ ఇచ్చారు. స్టార్ సెలబ్రిటీలతో టాక్ షో ఉండబోతున్నట్టు రానా తెలియజేశాడు. రానా అండ్ సెలబ్రిటీల స్టైల్‌లో సాగే ఈ సిరీస్ నవంబర్ 23న అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రీమియర్ కానుంది. ఫిల్టర్ చేయని, స్క్రిప్ట్ లేని.. మరిచిపోలేనిది.. అంటూ విడుదల చేసిన ట్రైలర్ నెట్టింట వైరల్ అవుతోంది. రానా చేయబోయే షోలో రొటీన్ అంశాలే ఉండబోతున్నాయా.. ? లేదా ప్రేక్షకులకు కొత్త యాంగిల్ ఏమైనా చూపించడబోతున్నాడా..? అన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

# కన్నప్పతోనైనా
## మంచు విష్ణుకు హిట్టు పడేనా..?



కబురు సినిమా నవంబర్ 15..

మంచు విష్ణు హీరోగా ఎంట్రీ ఇచ్చి రెండు దశాబ్దాలు దాటింది. ఇన్నాళ్ల సినీ ప్రస్థానంలో విష్ణు దక్కించుకున్న విజయాలు ఎన్ని అంటే చాలా చాలా తక్కువ అని చెప్పాలి. కెరీర్ ఆరంభంలో కాస్త పర్వాలేదు అనిపించినా గత పదేళ్ల కాలంలో ఆయన నుంచి వచ్చిన సినిమాలు తక్కువే, అందులో ఆయనకు ఒక్క హిట్టు కూడా లేదు. అయినా తన ప్రయత్నాలు మాత్రం ఆపడం లేదు. ప్రస్తుతం భారీ బడ్జెట్‌తో స్వీయ నిర్మాణంలో మంచు విష్ణు 'కన్నప్ప' సినిమాను చేస్తున్నారు. మంచు విష్ణు సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి 20 ఏళ్లు పూర్తి అయింది. మొదటి పదేళ్లు స్పీడ్‌గా సినిమాలు చేసి, పర్వాలేదు అన్నట్లు ఫలితాలు సొంతం చేసుకున్న విష్ణుకు కొన్ని సూపర్ హిట్‌లు సైతం దక్కాయి. కానీ గత పదేళ్లుగా ఒక్క సినిమా సైతం హిట్ కాలేదు. పైగా ప్రతి సినిమా డిజాస్టర్, అంతకు మించి అన్నట్లుగా దారుణ ఫలితాలను చవిచూశాయి. విభిన్న చిత్రాలను ఎంపిక చేసుకుని, ప్రతి సినిమాకు చాలా కష్టపడుతున్నా మంచు విష్ణుకు ఆశించిన సక్సెస్ మాత్రం రావడం లేదనిపిస్తుంది. తనపై ఎంతగా విమర్శలు వచ్చినా, తన సినిమాలు ఎంతటి డిజాస్టర్‌ను చవిచూసినా తన ప్రయత్నాలను మాత్రం మానడం లేదు. సినిమాపై ఉన్న ఆసక్తితో వరుసగా ప్రాజెక్టులు చేస్తూనే ఉన్నాడు. ఈసారి ఏకంగా భారీ బడ్జెట్‌తో 'కన్నప్ప' అనే సినిమాను చేస్తున్నారు. మొదట్లో అనుకున్న స్థాయికి రెట్టింపు కన్నప్ప బడ్జెట్ చేరినట్టుగా కనిపిస్తోంది. భారీ క్యాస్టింగ్‌తో కన్నప్పను గ్రాండ్ లెవెల్లో విష్ణు నిర్మిస్తున్నాడు.

# కుబేర పోస్టర్ విడుదల
## కీలక పాత్రలో అక్కినేని నాగార్జున

కబురు సినిమా నవంబర్ 15..

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం కుబేర. ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. అక్కినేని నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్నాడు. తాజాగా కుబేర గ్లింప్స్ అప్‌డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. గ్లింప్స్‌ను ఇవాళ సాయంత్రం 5:31 గంటలకు విడుదల చేయనున్నట్టు ప్రకటిస్తూ.. షేర్ చేసిన లుక్‌లో ధనుష్, అపార్ట్‌మెంట్స్, బిల్డింగ్స్, నోట్లను చూడొచ్చు. ఈ లుక్ గ్లింప్స్, సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ధైర్యవంతులనే అదృష్టం వరిస్తుంది.. అంటూ చెదిరిన వెంట్రుకలు, మాసిన గడ్డంతో నవ్వుతూ కనిపిస్తున్న ధనుష్ లుక్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పీ రామ్‌మోహన్ రావు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. సోషల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. కుబేరలో పాపులర్ బాలీవుడ్ యాక్టర్ జిమ్ సర్బ్ కీ రోల్‌లో నటిస్తున్నాడు.




ఇప్పటికే విడుదల చేసిన జిమ్ సర్బ్ పాత్ర లుక్‌లో.. స్టైలిష్ సూట్‌లో నోట్ల కట్టల మధ్య నిల్చొని ఆసక్తిని రేకెత్తిస్తున్నాడు.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com